152
800

* నూరు పూలు వికసించాలి ; వేల భావాలు సంఘర్షించాలి!-మావో
* మతములన్నియు మాసిపోవును, జ్ఞానమొక్కటి నిలిచి వెలుగును!-గురజాడ
* కుల మతాల పంజరాన గుట్టుపడను-విశ్వనరుడును నేను!-గుఱ్ఱం జాషువా
* "ఇతరుల స్వేచ్ఛను హరించేవారు తమ స్వేచ్ఛకు అర్హులుకారు"!-అబ్రహాంలింకన్
* "శాస్త్రీయ దృక్పథాన్నీ, మానవవాదాన్నీ, పరిశీలనా స్ఫూర్తినీ, సంస్కరణను పెంపొందించడం ప్రతి పౌరుని ప్రాథమిక విధి" భారత రాజ్యాంగం 51ఎ(హెచ్)
* సామాజిక, శాస్త్రీయ, హేతువాద సాంస్కృతిక విప్లవం వర్ధిల్లాలి!!!

హేతువాదం

(సామాజిక, సాంస్కృతిక, తాత్విక గ్రంథం)

డిసెంబరు 2020, ప్రధాన సంపాదకులు: క్రాంతికార్, పేజీలు:40, వెల:రూ.20/-

సంపాదకీయం!

1. రాజకీయ- మత ఫాసిజాన్ని ప్రతిఘటించుదాం!

1. మతం, మతతత్వం-అసంబద్ధ, అహేతుక, స్వార్థ పూరిత అజ్ఞానం నుండి ఆవిర్భవించి, పరిణామం చెందింది. మతం, మతతత్వం స్పష్టాతి స్పష్టంగా -దోపిడీ పీడనలకు , దోపిడీ రాజకీయాలకు రక్షా కవచంగా నిలిచిందీ, నిలుస్తోంది!

2. మతానికి ప్రత్యామ్నాయంగా-ఆనాటి చార్వాకులు, లోకాయతులతోపాటు నేటి శాస్త్రీయ హేతువాదులు,నాస్తికులు, మానవవాదులు, లౌకికవాదులు, గతి, తార్కిక, చారిత్రక భౌతిక వాదులు, అభ్యుదయవాదులు, వామ పక్షాలు, సంఘాలు నిలిచి మతాలకు రాజకీయ-మతాలకు వ్యతిరేకంగా పోరాడుతున్నాయి! మతం కన్నా మానవత మిన్న!

3. మతం-మతతత్వం ముదిరి,ముదిరి, పెరిగి మతోన్మాదంగా, మతోగ్ర వాదంగా, మత ఫాసిజంగా ప్రబలుతూ, ప్రపంచ ప్రజల ప్రధాన శత్రువుగా కరాళనృత్యం చేస్తోంది!

4. ప్రతి కమ్యూనిస్టు, అభ్యుదయవాదులు అవశ్యంగా హేతువాదియై ఉండాలి! హేతువాది కానివాడు, హేతు దృక్పథం లేనివాడు నిజమైన కమ్యూనిస్టు కానేరడు!

5. నిజమైన శాస్త్రీయ హేతువాదం, సామ్యవాదం, లౌకిక వాదం, గతి - తార్కిక చారిత్రక, భౌతికవాదం లోపించినందు వల్లే పలు కమ్యూనిస్టు దేశాలు బూర్జువా దేశాలుగా మారిపోవటం నేటి చారిత్రక పరిణామం!

6. మతాన్ని - రాజకీయాల నుండి, సంస్కృతి నుండి, సాహిత్యం, కళల నుండి వేరు చేయాలి! మత రాజకీయాలే, రాజకీయ మతాలే, నాటి, నేటి సామాజిక, రాజకీయ అస్తవ్యవస్థకు, అస్థిరతకు, అల్లకల్లోలాలకూ, గందరగోళానికి, అసలు, సిసలు, ఏసరుగా, కారణంగా నిలుస్తున్నాయి.

7. లౌకిక రాజ్యం ఏ మతాన్నీ, ఏమత కార్యకలాపాలకను ప్రోత్సహించకూడదు! లౌకిక దేశ పాలకులుగా వారు ఏ మత సంబంధ ఉత్సవాల్లో, మత రాజకీయాల్లో ...నరాదు!

8. రాజకీయాలు+మతం కుమ్మక్కయితే - రాజకీయ మత ఫాశిజానికి, మత-నాజీ యిజానికి అవశ్యంగా దారితీస్తుంది!

9. నేడు దేశ ప్రజలపై స్వారీ-చేస్తున్న - రాజకీయ-మత ఫాశిజానికి, మతోగ్రవాదానికి అశాస్త్రీయ భావ జాలానికి, అసమానతలకూ, కుల,మత,వర్గ వివక్షతలకూ, పితృ స్వామ్య ఆధిపత్యానికి, మహిళలపై జరుగుతోన్న అత్యాచారాలకు, అణచివేతలకు-వ్యతిరేకంగా ప్రజానీకాన్ని చైతన్య పరచి, సంఘటితపరచి, సమరశీల పోరాటాలను సమైక్యంగా సుదీర్ఘకాలం కొనసాగించాల్సిన ఆవశ్యకత, చారిత్రక కర్తవ్యం మనందరిపై నేడెంతైనా వుంది!

10.కుల, మత, వర్గ-దోపిడీ రహిత, శాస్త్రీయ హేతువాద, నాస్తికవాద, మానవ వాద,లౌకికవాద, ప్రజాస్వామిక, సామ్యవాద వ్యవస్థను స్థాపించుకొనేందుకై- మన మంతాశాస్త్రీయ, హేతువాద, నాస్తిక, మానవవాద, లౌకికవాద, సామ్యవాద, అభ్యుదయ,ప్రగతిశీల శక్తులంతా సమైక్యమై కలసికట్టుగా దీర్ఘకాలిక సమరశీల పోరాటాలను దీక్షాబద్ధంగా కొనసాగిద్దాం! కదలిరండి! అంతిమ విజయం మనదే! సమరశీల ప్రజానీకానిదే! పోదాం, పోదాం ముందుకు! ముమ్ముందుకే పోదాం!!!

రాజకీయ - మత ఫాశిస్టు - వ్యతిరేక ఐక్య సంఘటనను నిర్మించుకుందాం!

పెట్రేగిపోతున్న రాజకీయ - మత ఫాశిజాన్ని సమైక్యంగా ప్రతిఘటించుదాం!

క్రాంతికార్ హేతువాద ఆదేశాలు!

1."ఎందుకు?", "ఏమిటి?", "ఎలా?" అని ప్రతి దానిని ప్రశ్నించాలి. హేతుబద్ధంగా ఆలోచించాలి, తార్కికంగా పరిశీలించాలి, సమగ్రంగా విశ్లేషించాలి! సత్యంగా, వాస్తవంగా, యధార్థంగా నిర్ధారణయైన వాటినే స్వీకరించి, అనుసరించటమే హేతువాద దృక్పథం.

2.సరైన ఆలోచనలకూ, తార్కిక విశ్లేషణకు, ఇంగిత జ్ఞానానికి, విచక్షణా బుద్ధికి, ప్రగతి శీలతకు దోహదం చేసేదే హేతువాదం!

3.హేతుబద్ధంగా సంశయించటం, ప్రశ్నించటం, తార్కిక దృష్టి, శాస్త్రీయ అవగాహన,పరిశోధనా స్ఫూర్తితో విశ్లేషించటం, స్పష్టమైన కార్యాచరణ, సమగ్రమైన సామాజిక,సాంస్కృతిక విప్లవానికి దోహదం చేయటమే-శాస్త్రీయ హేతువాద ఉద్యమం యొక్క ఆశయం,లక్ష్యం.

4.మనం చెప్పే మాటలకు, చేతలకు, ఉద్బోధలకూ - కార్యాచరణకు మధ్య వైరుధ్యం వుండకూడదు! ముఖ్యంగా మన కార్యాచరణనే - ప్రజలు గుర్తిస్తారు, ఆదర్శ ప్రాయంగా, మార్గదర్శకంగా స్వీకరిస్తారు!

5.సహేతుక బుద్ధి, విజ్ఞానం, శాస్త్రీయ హేతువాద, గతి తార్కిక, చారిత్రక, భౌతికవాద దృక్పథం లేని వాడు, లేని సంఘం, పక్షం సామాజిక వికాస కృషిని జయప్రదంగా సాగించలేడు! సాధించలేడు!

6.దేనినైనా గుడ్డిగా నమ్మడానికి, ఎవ్వరినైనా యెడ్డెగా అనుసరించడానికి పెద్దగా శ్రమపడాల్సిన పనిలేదు.

7. సహేతుకంగా ఆలోచించడానికి, ప్రశ్నించి, తర్కించి, విశ్లేషించి,అసలు - సిసలు సరైన సత్య జ్ఞానం గ్రహించడానికి - సుశాస్త్రీయమైన అధ్యయనం తప్పనిసరి.

8.చెప్పింది చేయడానికి, ప్రత్యామ్నాయ మార్గం ఎంచుకొని, అనుసరించడానికి -కార్యాచరణకు శాస్త్రీయ సైద్ధాంతిక నిబద్ధత, పట్టు వీడని దృఢ దీక్ష అత్యంతావశ్యకం.

9.మనిషిని దరిద్రునిగా, దాసునిగా, దాసునిగా, దీనుడిగా, హీనుడిగా, మూఢ విశ్వాసిగా-వర్గాలుగా విభజించిన దుష్ట సమాజాన్ని, దోపిడీ పాలక వర్గాలను, మతాలను, సమూలంగా నిర్మూలించేందుకై - సామాజిక, సాంస్కృతిక విప్లవాన్ని - సమైక్యంగా సుదీర్ఘ కాలం కొనసాగించాల్సిన ఆవశ్యకత, కర్తవ్యం - హేతువాద, అభ్యుదయ, ప్రగతిశీల శక్తులందరిపైన నేడెంతైనా వుంది!

2. కమ్యూనిజానికి ప్రేరణనిస్తున్న కరోనా వైరస్!!!

కరోనా వైరస్ సంఘీభావం,సామాజిక న్యాయం, అంతర్జాతీయత అనే విలువల అవసరాన్ని - అంటే కమ్యూనిజాన్ని ముందుకు తెచ్చిందంటున్నారు అలెక్సాండ్ర్ బుజ్గాలిన్.

'దురదృష్టమనే దాని సహాయం లేకపోతే, సంతోషమనేదే ఉండదు'-రష్యన్ సామెత

కరోనా వైరస్ మహమ్మారి మన సామూహిక, సాంఘిక జీవనంలోని అత్యంత తీవ్రమైన సమస్యలనూ, దాని ప్రధాన వైరుధ్యాలనూ బట్టబయలు చేసింది. ఈ పరిణామను ఒకానొక కోణాన్ని ప్రచార సాధనాలు విపరీతంగా పెంచి పోషిస్తున్నాయి. అదేమంటే మనం ఒకరిని చూసి, ఒకరం భయపడుతున్న స్థితికి చేరాం. అంతర్జాతీయ సంబంధాలన్నీ తెగిపోతే బాగుండునని కలలు కంటున్నాం. ఒకరితో ఒకరం సంబంధాలు లేకుండా ఉండాలనుకుంటున్నాం. ప్రతి అంశంలోనూ మనం చైనా వాళ్ళ (లేదా అమెరికన్లు, ఇటాలియన్లు, రష్యన్లు, మనం ఎవరి పేరు పెట్టదలుచుకుంటే వారి)చెయ్యి ఉందని అనుమానిస్తున్నాం. ఇక్కడి నుంచి ఒక్క అడుగు వేస్తే ఇక మనం చేరేది జాత్యంహాకార వాదానికే, ఒక 'నూతన ప్రపంచం' ఆవిర్భవిస్తుందని, ఆ ప్రపంచంలో ఒకరితో ఒకరు చేతులు కలపడానికి భయపడడం మాత్రమేకాదు, మొత్తంగా ఏ ఒక్కరి గురించి అయినా ప్రతి ఒక్కరూ భయపడే పరిస్థితికి చేరుతున్నామని అప్పుడే కొందరు అంటున్నారు.

అయితే ఈ నాణానికి మరొక ముఖం ఉంది. ఎంత పెద్ద మొత్తంలో డబ్బు పెట్టినా కొనలేని ఎన్నో వస్తువులు ప్రపంచంలో ఉన్నాయనీ, 'మార్కెట్ అదృశ్య హస్తం' మీద ఆధారపడి పరిష్కరించలేని అత్యంత కష్టతరమైన సమస్యలెన్నో ఉన్నాయనీ, జనానికి 'హఠాత్తుగా' తెలిసి వస్తున్నది. అంతేకాదు, ఆ సమస్యలను మనం ఒంటరిగా పరిష్కరించలేమని కూడా తెలిసివస్తున్నది. మన ప్రపంచమంతా ఒకటేననీ, దాన్ని రక్షించడానికి అందరమూ కలిసి పనిచేయవలసిందేనని తెలిసివస్తున్నది. క్వారంటైన్‌లూ, కలవకుండా ఉండడాలూ ఎంత ముఖ్యమైనప్పటికీ, ఈ మహా విపత్తును ఓడించాలంటే మనమందరమూ కలిసి, ప్రపంచమంతా ఒకటిగా, ఉమ్మడిగా పనిచేయవలసిందేనని తెలిసివస్తున్నది. క్వారంటైన్ అనేది మనను మనం రక్షించుకునే సాధనమూ కాదు, ప్రతి ఒక్కరినీ రక్షించడానికి అనివార్యమైనదీ కాదు.

ఈ సాధారణ అభిప్రాయాలను దాటి, వాస్తవాలను గ్రహించి,అక్కడి నుంచి ఆ వాస్తవాల పరిణామాలేమిటో గుర్తించడానికి ప్రయత్నించవలసి వుంది. ఈ సమస్యను పరిష్కరించే వ్యూహాన్ని కనిపెట్టాలంటే ఈ సమస్య సారాంశాన్ని అర్థం చేసుకోవడానికి మనం ప్రయత్నించవలసి ఉంది.

ఎవరికి వారు ఒంటరిగా ఉండడం....సంఘీభావానికి దారి

వివాస్తవం: మనం మన స్నేహితుల గురించి కూడ భయపడడం

మొదలుపెట్టాం. ఇంటర్నెట్ మీద ఒక విషాద పరిహాసం చలామణీలో ఉంది. 'మిత్రులారా, ఈ కష్టకాలంలో మనం ఒకరి నుంచి ఒకరం వీలైనంత దూరంగా ఉండాలి' అని అది పిలుపునిస్తున్నది. కాని ఒక భిన్నమైన ధోరణి కూడా ఉన్నది. 'ఎవరికి వారే' అనే వ్యక్తిగత వినియోగదారుడు హేతుబద్ధ మార్కెట్ స్వభావం గురించి నిన్నటి దాకా బోధిస్తుండినవాళ్లు కూడా.ఇప్పుడు మనమందరమూ ఒకే మునిగిపోతున్న 'పడవలో ఉన్నాం' అని అర్థం చేసుకోవడం మొదలుపెట్టారు.

మన కళ్ల ముందరే కొన్ని విషయాలు మారిపోతున్నాయి. అన్నిచోట్లా మార్పు జరుగుతున్నదని కాదు.అయినా, పెద్దవారికి సాయపడాలనీ, స్వచ్ఛంధ సంస్థల పనిలో భాగం పంచుకోవాలనీ యువకులలో తపన కనబడుతున్నది. నిన్నటిదాక ఎక్కడో ఒక చిత్రమైన మినహాయింపుగా మాత్రమే ఉండిన ఈ ధోరణి ఇవాళ ఒక విస్తృతమైన ధోరణిగా మారింది. ఇటాలియన్లు సాయంత్రం ఆరు గంటలకల్లా తమ వరండాలలో నిలబడి వైద్య సిబ్బందికి ప్రశంసలు అందిస్తున్నారు. ఒకరితోకరు పాటలు పాడుకుంటున్నారు.మాస్కో స్టేట్ యూనివర్శిటీ విద్యార్థులు 65 ఏళ్ళు దాటిన తమ ప్రొఫెసర్లకు సహాయం అవసరమైతే సంకోచించ వద్దని చెపుతున్నారు. యువజనుల సంస్కృతిలో పరస్పర సహాయం నిత్యకృత్యమైపోయింది. ఒకప్పుడు వామపక్ష శిబిరాల్లో మాత్రమే ఉండిన పరస్పర సహాయం ఇవాళ విస్తృత ప్రజాసమూహాల్లో కనబడుతున్నది. ప్రజల జీవితాల్లో నిన్నటి వరకూ ప్రధాన స్వభావంగా ఉండిన వ్యక్తివాదం ఇవాళ ఇంతెంత మాత్రమూ నెలరోజుల కింద కనబడినంత పవిత్రంగా కనబడడంలేదు.

మహా మాల్‌లన్నీ ఖాళీ అయిపోయాయి. సరుకులు కొంటూ కాలం గడపడం అనేది లేకుండా వాస్తవంగా జీవితాలు గడపవచ్చునని మనం హఠాత్తుగా గుర్తించడం మొదలుపెట్టాం.మార్కెట్‌లోకి వచ్చిన కొత్త కారు కొనడం కోసమే జీవించడమనేది ఏమంత గొప్ప విషయం కాదనీ, బహుశా తెలివితక్కువ తనమని తెలిసివస్తున్నది. కుటుంబమంతా కలిసి పుస్తకాలు చదువుకోవచ్చని సినిమాలు చూడవచ్చుననీ తెలిసివస్తున్నది. కొత్త సామాజిక వాతావరణంలో వినియోగదారీ సమాజపు ఎండమావులు కదిలిపోతున్నాయి. కరిగిపోతున్నాయి, చెల్లాచెదురై పోతున్నాయి.

కాని, ఆగండి, మనమింకా కమ్యూనిజం విజయానికి చేరలేదు. కాని పాత సోవియట్ యుగంలో 'వాస్తవంగా ఉనికిలో ఉండిన సోషలిజం' అంతమైపోయిన తర్వాత, మొట్టమొదటిసారిగా కోట్లాదిమంది మనుషులు డబ్బుకూ, ఘనత వహించిన బ్రాండ్లకు, అత్యాధునిక జీవనశైలికి భిన్నమైన సంగతుల గురించి తీవ్రంగా ఆలోచించడం ప్రారంభించారు. తమ జీవితాలను పోటీలేని ప్రపంచంలో, సంఘీభావం విలసిల్లే ప్రపంచంలో సాగించగల అవకాశాల గురించి ఆలోచించడం ప్రారంభించారు.

అవును, చివరికి ఉదారవాద రాజకీయవేత్తలు కూడా ఆ పదం ఉచ్చరించడానికి ఇంతెంత మాత్రమూ భయపడడం లేదు. ఆ పదం సంఘీభావం ఎందుకు? ఎందుకంటే జీవితం సంఘీభావాన్ని కోరుతున్నది గనుక, అందుకే

వ్యతిరేకంగా ఒక్కరి పోరాటం అనే భావన, మార్కెట్ అదృశ్యహస్తం అనే భావన ఈ మహమ్మారి సమస్యను పరిష్కరించబోవడం లేదు. ఈ మహమ్మారికి వ్యతిరేక పోరాటం ప్రధానంగా మార్కెటేతర చర్యలను కోరుతున్నది. అందరినీ సమానంగా చుట్టుముటిన ఈ ఉత్పాతానికి ప్రధాన ప్రతిఘటన శక్తులు రాజ్యం చేపట్టవలసిన నియంత్రణ , ప్రజా కార్యక్రమాలు, పరస్పర సహకారం, వ్యక్తిగత నిగ్రహం,ఉమ్మడి సమస్యల పరిష్కారంలో వ్యక్తిగత అహంకారాలను వదులుకోవడం శతాబ్దాలుగా ఉదారవాదులు లేదు లేదని చెబుతున్న సామాజిక సమిష్టి ప్రయోజనం ఎంత వాస్తవమో ఇవాళ ప్రతి ఒక్కరికీ తెలిసివస్తున్నది.

కాని అధునిక జాతి రాజ్యాలు ప్రజల సమిష్టి కార్యచరణ ద్వారా సమస్యలను పరిష్కరించడానికి పూనుకోవు. ఇప్పటి వరకూ ప్రపంచ అధిపత్య శక్తుల గుప్పెట్లో ఉన్న ప్రపంచ మార్కెట్ ఆపని చేయడం అంతకంటే ఎక్కువ అసాధ్యం. ఆ పని అత్యధిక ప్రజానీకపు ప్రయోజనాలకు అనుకూలమైన కార్యాచరణ, అది ద్రవ్య పెట్టుబడి ప్రయోజనాలనూ, చమురు, ప్రచారసాధనాలు, వగైరా కార్పొరేషన్ల ప్రయోజనాలనూ తీర్చడానికి చేపట్టవలసినదికాదు. ఇవాళ ప్రపంచమంతటా ఒక దృశ్యం స్పష్టంగా బైటపడుతున్నది. అదేమంటే ఎక్కడైతే ప్రభుత్వ రంగం బలహీనంగా ఉన్నదో, ఎక్కడైతే రాజ్యం సామాజిక ప్రయోజనాల కోసం కాకుండా ఒక అత్యల్ప సంఖ్యాక వ్యాపార, అధికార ప్రయోజనాల కోసం పనిచేస్తున్నదో, అక్కడ అతి ఎక్కువ మంది జీవితాలను వైరస్ బలిగొంటున్నది.

ప్రత్యామ్నాయం సుస్పష్టమే. అది రాజ్యమూ, పౌర సమాజమూ కలిసి అత్యంత కీలకమైన వ్యవస్థలలో ప్రణాళికబద్ధమైన, ప్రత్యక్ష(మార్కెటేతర)సంఘీభావ చర్యలు తీసుకోవడం, ఆ చర్యల వల్ల మొట్టమొదట ఆరోగ్య రంగం, సామాజిక భద్రత, మౌళిక సౌకర్యాలు, విద్యుత్ సరఫరా, ప్రజల సహకారయుత ఉత్పాదక సామర్ధ్యం కనిపిస్తాయి. ఇక్కడ మనం తప్పనిసరిగా ప్రభుత్వ, ప్రైవేటు కార్పొరేషన్లను సాహసికంగా సామాజికీకరించే వైపు అడుగులు వేయాలి. సమాజ ప్రయోజనాల కొరకు నిర్వహణ అనే లక్ష్యంతో ప్రజా నియంత్రణ, పారదర్శక నిర్వాహణ అమలు కావాలి. మార్కెట్ వ్యవస్థల ఆదేశాలను తప్పనిసరిగా బద్దలుకొట్టాలి. మనం స్పష్టమైన, పారదర్శకమైన , కొత్త నిబంధనలు రూపొందించి, వాటిని కచ్చితంగా , క్రమబద్ధంగా పాటించే మార్గంలో ముందుకు సాగాలి. సాధారణ ప్రజా ప్రయోజనాలను నెరవేర్చడమే లక్ష్యం కావాలి. అంటే ఇక్కడ మనం సొంత ఆస్తి పవిత్రత సూత్రాన్ని, లాభాలను ఇతోధికంగా పెంచుకోవడంలో ఉన్న ప్రయోజనాలను రెండోస్థాయికి నెట్టివేయాలి.

ఈ పనులను ఏ రాజ్యాలు చేస్తాయి, ఎంతవరకు చేస్తాయి అనేది ఆయా రాజ్యాల పౌరుల మీద ఆధారపడి ఉంటుంది. అలాగే ఈ చర్యలు తీసుకొమ్మని మన అధికార వర్గాలను మనం ఎంత స్పష్టంగా, ఎంత నిర్విరామంగా, ఎంత క్రియాశీలకంగా కోరుతామనే దానిమీద ఆధారపడి ఉంటుంది. గతంలో ఆదర్శవంతులైన వామపక్షవాదులు ఇచ్చిన ఉపోద్ఘాత నినాదం, 'లాభాల కోసం కాదు, ప్రజల కోసం' అనేదాన్ని ఇవాళ్ల తిరిగి వినిపించవలసి ఉన్నది. ప్రస్తుత

మహమ్మారి అన్నిటికన్న ముందుకు తీసుకువచ్చిన అంశం ఇదే.

ఈ వైరస్ 'ప్రజాస్వామికమైనది-అంటే సామాజిక న్యాయం ప్రతి ఒక్కరి ప్రయోజనం!

రెండోవాస్తవం: ఈ వైరస్ తనదైన పద్ధతిలో ప్రజాస్వామికమైనది. ప్రతి ఒక్కరికీ అది సోకుతుంది. ప్రభుత్వం నడిపే మంత్రులు, తళుకుబెళుకుల తారలు, కోటీశ్వర్లు, బిచ్చగాళ్లు అందరూ , ఈ వైరస్అందరిని సమానంగా చూస్తుందని పిస్తుంది. కాని అన్ని రకాలుగానూ సమానము చేయదు. అన్ని విషయాలను జయించడానికి డబ్బుకు ఉన్న సామర్థ్యం మీద ఈ మహమ్మారికి ఒక సవాల్ విసిరింది. కాని ఇంకా జవాబునివ్వలేదు. గతంలో లానే, ప్రపంచంలో ఇంకా భిన్నమైన సంబంధాల వ్యవస్థే ప్రాబల్యంలో ఉంది. కొందరు ఇంకా విలాసాలలోనే జీవిస్తున్నారు. అత్యంత సమర్థమైన పరిస్థితుల్లో చికిత్స పొందగలుగుతున్నారు.కాగా కోట్లాది మంది కనీసమైన మందులకు అవసరమైన డబ్బు లేని స్థితిలో ఉన్నారు. వాళ్లంతా ప్రపంచపు 'అంచులలో' పేదదేశాల పౌరులు మాత్రమే కాదు. వారిలోనెలకు పది పదిహేను వేల రూబులు సంపాదించే కోట్లాది మంది రష్యన్ ప్రజలూ ఉన్నారు. మన మహామహా నగరాలకు వలస వచ్చినవారూ ఉన్నారు.

ఈ ప్రపంచ మహమ్మారి విచిత్రం ఏమంటే, బిచ్చగాళ్ళు వైరస్ బారినపడినప్పుడు ప్రతి ఒక్కరూ మరణాంతక ప్రమాదంలో చిక్కక తప్పదు. ఆ భయంలో వ్యవస్థా నిర్వాహకులకు కూడా మినహాయింపు లేదు. మనం ఆ సమస్యనూ అందరమూ కలిసి, అందరి కొరకూ పరిష్కరించనైనా పరిష్కరించాలి. లేదా అందరికందరమూ ఇతోధిక ప్రమాదంలో అంతమైపోవడమైనా జరుగుతుంది. ఈ సమస్యను పరిష్కరించడంలో అందరికందరమూ చేతులు కలపాలంటే, ఇతరుల వందలరెట్లో, వేలరెట్లో ఎక్కువ సంపద ఉన్నవారు కనీసం తమ సంపదలో గణనీయమైన భాగాన్ని ఈ కృషికి ఇవ్వాలి. ఇది అనివార్యం.ఇది కేవలం నైతిక సమస్యకాదు. మహమ్మారిని అధిగమించాలంటే అది అత్యవసరం. మహమ్మారిని అధిగమించడానికి అవసరమైన నిధులను కోటీశ్వరులూ, శతకోటీశ్వరులూ ఇవ్వాలిసిందే. వాళ్ళు అవని చేయవలసిది తమ పెట్టుబడులపై, మదుపులపై కోత విధింపు కాదు, తమ సొంత వినియోగాన్ని తగ్గించుకుని ఇవ్వాలి. ఇక్కడ విధించే ఆంక్షలు అత్యవసరమైనవి. ఎందుకంటే తద్వారా మాత్రమే ఎవరికి ఇబ్బంది ఎవరికీ పెద్ద నష్టం కలగదు. చివరికి మహాచోరులకు కూడా దీనితో పోయేదేమీ లేదు. కేవలం ఈ మహమ్మారి రోజుల్లో వాళ్ళు తమ కొత్త విహార నౌకలు కొనే ఆలోచనలను, తమ మహా భవనాల అలంకరణ ఆలోచనలను పక్కన పెడితే చాలు.

మొన్నటి చలికాలంలోనే పెట్టుబడి ప్రయోజనాల కన్న సమాజ ప్రయోజనాలకు ప్రాధాన్యత ఇవ్వడం అసాధ్యమేనా అనే ఒక తీవ్ర చర్చ జరిగింది. నిజానికి అప్పటికి ముసుకు వస్తున్న ఆర్థికసంక్షోభం అటువంటి విషయాల మీద కొత్త ఆలోచనలు చేయడానికి ప్రజలను పురికొల్పవలసింది. కాని, అప్పటి చర్చలో, రష్యన్ సామెత చెప్పినట్టు, వండిన కోడి ఎవరినీ పొడవలేదు. కాని ఇప్పుడది

పొడుసున్తున్నది. పెట్టుబడి యజమానులు తమ లాభాల గురించి పూర్తిగా మరిచిపోయారని అనలేము. తమ ఆదాయాలను ఈ అంటువ్యాధి మీద పోరాటానికి అప్పగించాలనే భావాలతో మునిగి తేలుతున్నారని అనలేను. కాని కొన్ని ప్రతీకాత్మక చర్యలు జరిగాయి. వాస్తవమేమంటే, లాభాలను మరిచిపోవడం జరగనేలేదు.

ఇప్పుడు కూడా పెట్టుబడి యజమానులు ప్రపంచ జనాభాలో సగానికి ఈ అంటువ్యాధి అంటినా సరే అని సిద్ధంగా ఉన్నారు గాని, తమ విదేశీ ఆర్థిక స్థావరాల మీద నిషేధం విధించడానికి గాని, తమ సొంత ఖర్చులలో ఒకపెద్ద భాగాన్ని ప్రజా అవసరాలు తీర్చడానికి, మళ్లించడానికి గాని సిద్ధంగా లేరు. కాని వీళ్లు తమ సంపదలో కొంచెమైన పంచుకొనేలా ఒత్తిడి తేవడం అవసరమని అశేష ప్రజానీకం అర్థం చేసుకుంటున్నారు. చివరికి రాజ్యం కూడా ఆవిషయం అర్థం చేసుకుంటున్నది. ఈ మహాసంస్థలకు సేవ చేయడమే దానికి ఇప్పటి వరకు తెలిసింది. కాని ఇప్పుడు మాత్రం దాని వెన్నెముకలో ఒక చిన్న గగుర్పాటు కలుగుతున్నది. పౌరుల జీవితాల పట్ల తన బాధ్యతను గుర్తు తెచ్చుకొమ్మని ఆ గగుర్పాటు సూచిస్తున్నది.ఈ వ్యవహారంలో రాజ్యపు నిష్క్రియనూ, తాత్సారాన్నీ మనం ఎప్పటికీ క్షమించలేం. ఈలోగా, మహమ్మారులూ క్వారంటైన్‌లూ నిండిన ప్రపంచంలో జీవించడం కన్న తమ ఆదాయాలలో, చివరికి ఆస్తులలో కూడా ఒక భాగాన్ని ఇతరులతో పంచుకోవడం మంచిదని కోటీశ్వరుల, శతకోటీశ్వరుల పరివారాలలోని కొందరు వ్యక్తులైనా గుర్తిస్తున్నారు.

సామాజిక చైతన్యంలో తలెత్తుతున్న ఈమార్పు సాపేక్షిక నిర్ణయాత్మక చర్యలకు దారితీయగలదా లేదా అనేది మళ్లీ మనమీదనే ఆధారపడి ఉంటుంది. రష్యన్ ఫెడరేషన్‌తో సహా ఎన్నో రాజ్యాలు తొలి పిలికి అడుగులువేస్తున్నాయి. ప్రస్తుతానికైతే తమ పౌరుల శ్రమతో పోగుపడిన సంస్థల నిలువల నుంచి ఖర్చుపెడుతున్నాయి గాని, ఈస్థితి మారవచ్చు. అయితే, ఏది, ఏమైనప్పటికీ ఈ సమస్య జాతి రాజ్యాలు తమంతట తాము ఏదో చేస్తే పరిష్కారమయ్యేది కాదు.

సరిహద్దుల మూసివేత....అంతర్జాతీయతకు నాంది

మూడో వాస్తవం: ఈ మహమ్మారి మానవజాతి అంతటికీ సమస్య. అది మనలో ప్రతి ఒక్కరిపైనా ప్రత్యక్షంగా ప్రభావం చూపుతోంది. ప్రతి ఒక్క దేశంలోని పౌరులలో ప్రతి ఒక్కరి ప్రయోజనాల కోసం ప్రపంచమంతటా ఈ సమస్యను పరిష్కరించాల్సి ఉన్నదని వైరస్ చూపింది. సువిశాలమైన చైనాలో గాని, అత్యంత చిన్న దేశమైన మోల్డావియాలోగాని, మన సొంత రష్యాలో గాని ఎక్కడా మనం వైరస్ నుంచి తప్పించుకుని బతకలేం. విచిత్రమేమంటే, సరిహద్దుల మూసివేత, క్వారంటైన్‌లు, ఒంటరి జీవితాలు అవసరమైనవే అయినప్పటికీ, అవి కేవలం వైరస్ అంతర్జాతీయ వ్యాప్తిని తగ్గించే సాధనాలు మాత్రమే. చైనాలో అమలు చేసిన క్వారంటైన్ చైనీయులకు మాత్రమే కాదు, మన రష్యన్లతోపాటు, యావత్ ప్రపంచ ప్రజలకూ అత్యంత కీలకమైన అవసరమని రుజువైంది. తమ దేశ సరిహద్దులు మూసివేయడం

ద్వారా చైనీయులు సమస్యను పరిష్కరించడంలో మనం సంసిద్ధులం కావడానికి సహకరించారు. అదే ఇటలీకి కూడా వర్తిస్తుంది. ప్రతి దేశానికీ వర్తిస్తుంది. ఏదో ఒక అద్భుతం జరిగి మనం ఈ వైరస్‌ను రష్యాలో ఆపివేయడం జరిగినా, మానవాళిని ఈ వైరస్ నుంచో, భవిష్యత్తులో రానున్న వైరస్‌ల నుంచో రక్షించినట్టు కాదు, తద్వారా మనను మనం సురక్షితం చేసుకున్నట్టు కాదు. ఎందుకంటే రానున్న వైరస్ , లేదా మరేదో ప్రపంచ సమస్య అంతర్జాతీయ విమానాశ్రయాలలో అవరోధాల దగ్గర ఆగిపోదు.

ప్రజల మధ్య స్నేహ సంబంధాల, అంతర్జాతీయ సూత్రాల కీలక అవసరాన్ని ఈ వైరస్ చూపింది. ఈ మహమ్మారికి చికిత్స చేయడానికి అవసరమైన ఔషధాలలో ఒకటి 'అంతర్జాతీయ సంఘీభావం', ఇది పరిస్థితి అత్యంత క్లిష్టంగా ఉన్న దేశాలకూ , ప్రాంతాలకూ సహాయం అందించడం మాత్రమేకాదు. తమ సమస్యలను తామే పరిష్కరించుకోలేనంత పెద్ద స్థాయిలో పేదరికం ఉన్న దేశాలకూ, ప్రాంతాలకూ సహాయం అందించడంలో కూడా ఇందులో భాగమే మనం కేవలం మన ప్రయోజనాల కోసం మాత్రమే ఆలోచిస్తున్నప్పటికి వారికి సహాయం చేయడం అవసరం

బహుశా ఇక్కడ ప్రధాన విషయం, ఈ సందర్భంలో వైరస్‌కు వ్యతిరేక పోరాటంలో అన్ని విజయాలూ, అన్ని నూతన ఆవిష్కరణలూ, వ్యాక్సిన్ సృష్టించడానికి ఉన్న అన్ని రకాల మార్గాలూ, తదనంతర చర్యలూ, వ్యాక్సిన్ దాన్ని ఉత్పత్తి చేయడానికి అవసరమైన సాంకేతిక పరిజ్ఞానమూ అన్నీ కూడా మానవాళి అంతటికి చెందినవిగా గుర్తించాలి. ఎటువంటి ధర లేకుండా, ఎటువంటి పరిమితులు లేకుండా మానవాళి అంతటితో పంచుకోవాలి. ఈ వ్యాక్సిన్‌ను ఎవరు ఎక్కడ సృష్టించినప్పటికీ దాని మీద ప్రైవేటు మేధో హక్కుల ఆంక్షలు ఉండగూడదు.

జాతీయవాదం, అభివృద్ధినిరోధక ప్రజారంజకత్వం అద్దుకున్న నయా ఉదారవాద 'క్రీడా సూత్రాల' క్షేత్రంలో అటువంటి నిర్ణయానికి అవకాశం ఉందా?ఈ ప్రశ్న నిన్న అడిగినా నేను 'లేదు' అని జవాబు చెప్పి ఉండేవాణ్ణి కాని మన కళ్ల ముందే పరిస్థితి మారిపోతున్నది. అతి వేగంగా మారిపోతున్నది. ఒక హాస్యాస్పదమైన ఉదాహరణ ఇస్తాను. రష్యాలో జనం ఛలోక్తులను ఇష్టపడతారు. అత్యధిక ప్రజానీకపు మానసిక ఉద్వేగాలకు, ప్రజాభిప్రాయానికి అవే పెద్ద సూచికలు. అవి సర్వేల కన్నా విశ్వసనీయమైనవి. కరోనా వైరస్ గురించి సామాజిక వ్యాఖ్యలూ,ఛలోక్తులూ గత రెండు వారాలుగా విపరీతంగా ప్రజల్లో, చలామణి అవుతున్నాయి. వాటిలో ఒకే ఒక్కటి మీతో పంచుకుంటాను. అది మాకు యూరప్ నుంచి వచ్చింది. 'తళుకు బెళుకుల తారలకూ, ఫుట్‌బాల్ క్రీడాకారులకూ మీరు నెలకు లక్షల యూరోలు ముట్టజెపుతారు. జీవశాస్త్రవేత్తలకు నెలకు రెండు వేల యూరోలివ్వడానికి గింజుకుంటారు. ఇప్పుడేమో మీకో వ్యాక్సిన్ కావాలని మా దగ్గరికి వచ్చారా? వెళ్లండి ఆ తారల దగ్గరికే. వాళ్లు మీకోసం ఒక వ్యాక్సిన్ తయారు చేస్తారేమో చూడండి' అని ఒక శాస్త్రవేత్త అన్నాడట.

ఈ పరిహాసంలో, అటువంటి పరిహాసాలన్నింటిలో లాగనే, ఒక విస్మయకరమైన తలకిందుల వాస్తవం పొడసూపుతున్నది. బాండులు, మార్కెట్ డిరైవేటివ్‌లు, బ్రాండ్లు, సరికొత్త పేలం వెర్రి మోజులు, అతిప్రదర్శనలు వంటి ఎన్నో ప్రేరణా వస్తువుల తయారీ ద్వారా తన మనుగడ కొనసాగించుకుంటున్న ఆటవిక పెట్టుబడిదారీ విధానపు ప్రపంచం, వైరస్ వంటి సమస్యను అడ్డుకోవడానికి గాని, పరిష్కరించడానికి గాని తనకు శక్తి సామర్థ్యాలు లేవని రుజువు చేసుకుంటున్నది. (వేలాది, లక్షలాది మందిని వ్యాధి పీడితులను చేసి, మరణాంతకం చేసే ఈవైరస్ ను సృష్టించి ప్రపంచం మీదికి వదిలింది కూడా అదే కావచ్చు). ఈప్రపంచాన్ని మార్చక తప్పదు. ఈ మహమ్మారి దాడి చేసిన సందర్భంలో గత ఇరవై సంవత్సరాలలో రెండో పెద్ద ప్రపంచ స్థాయి ఆర్థిక సంక్షోభం ప్రారంభం కాబోతుండింది. అది కూడ ఈ ఫలితాన్నే పరోక్షంగా సూచించింది.ఇప్పుడు ఈ మహమ్మారి దాన్నే ప్రత్యక్షంగా సూచిస్తున్నది.

ముగింపుగా చెప్పాలంటే, సంఘీభావం కోసం, న్యాయం కోసం, అంతర్జాతీయత కోసం వెలువడుతున్న ఆకాంక్షలన్నీ ఒక కొత్త సమాజ ఆవిర్భావపు తొలిసూచనలు. ఈ కొత్త సమాజం ఆవిర్భావం కొరకు రెండు శతాబ్దాలుగా పెనుగులాడుతున్నది. అనేక హింసలు భరించింది. అనేక వైరుధ్యాల గుండా పయనించింది. ఎంతో నెత్తురూ, చెమటా కార్చింది. జన్మనెత్తడానికి రెండు శతాబ్దాలుగా ప్రయత్నిస్తున్నది. నూటయాభై సంవత్సరాల కింద మార్క్స్, ఎంగెల్స్ లు దాన్ని 'స్వేచ్ఛా ప్రపంచం' అని పిలిచారు. దాన్ని కమ్యూనిజం అంటారు. దాని అసలుపేరు అదే. దాని సారాంశంలో ఉన్నవి మూడు అంశాలు. సంఘీభావం, న్యాయం, అంతర్జాతీయత.

వాటితోపాటు మరొక అంశం ఉంది. అది స్వేచ్ఛ, చారిత్రక అభివృద్ధి నియమాలను తెలుసుకునే స్వేచ్ఛ. ఆ సూత్రాలకు అనుగుణంగా ప్రపంచాన్ని మార్చడానికి స్వేచ్ఛ, ప్రపంచాన్ని మార్చడానికిదే సమయం. రేపు అని కూచుంటే చాలా ఆలస్యమైపోవచ్చు. ఇవాళే మనం కచ్చితంగా స్థిరంగా వామపక్షం వైపు కదలకపోతే, మన మీద రేపు దిగబోయేది ఫాసిజం అనే మహా గత్తర.అది కరోనా వైరస్ కన్న మరింత భయంకరమైనది.

ఇవాళ మనం మరొకసారి ఎంచుకోవలసిన కర్తవ్యం 'కమ్యూనిజమా, బర్బరత్వమా' అనే ప్రత్యామ్నాయాలే.

తాజా కలం: ఈ వ్యాసానికి మూలాలు గత రెండు మూడు రోజులుగా ప్రత్యామ్నాయ ఉద్యమాల్లో (ఆల్టర్నేటివ్ మూవ్‌మెంట్)లో నా సహచర కామ్రేడ్స్ ల్యుడ్మిలా బులావ్కా, ఆండ్రే కోల్గానోవ్, నటాల్యా యాకొవ్లెవా తదితరులతో జరిగిన సంభాషణల ఆలోచనల్లో ఉన్నాయి. ఆ ఆలోచలన్నింటిని నేను ఈ వ్యాస రూపంలో ఒక సామూహిక సాయంత్రం అక్షరాల్లో పెట్టాను. ఆ సాయంత్రమే, ఈ వ్యాస రచన అయిపోయాక, ఇంటర్నెట్ మీద నేను దాదాపు ఇదే అంశంమీద రెండు వ్యాసాలు చూశాను. ఒకటి సుప్రసిద్ధ స్లొవేనియన్ మేధావి స్లావోజ్ జిజెక్ రాసినది, మరొకటి ఉక్రేనియన్ కార్యకర్త యూరీ లాతిష్ రాసినది. ఆతర్వాత మార్చ్ 28న రష్యన్ పబ్లిక్ టెలివిజన్‌లో

రైట్ టు నో కార్యక్రమంలో మాట్లాడుతూ సెర్జీ కుర్గిన్యాన్ ఇవాళ మన మీద పేరుకుపోయిన సమస్యలను పరిష్కరించాలంటే ఏకైక మార్గం సోవియట్ స్త్రీ పురుషులు మళ్లీ జన్మించవలసిన అవసరమే అన్నారు. అది ఒక మంచి సూచన. మళ్లీ ఒకసారి 'ప్రపంచాన్ని 'కమ్యూనిజం అనే భూతం' ఆవహిస్తున్నది! (ప్రొఫెసర్ అలెక్సాండ్ర్ వ్లదీమిరోవిచ్ బుజ్గాలిన్ రాజకీయార్థిక శాస్త్రవేత్త, తత్వవేత్త, మాస్కో స్టేట్ యూనివర్శిటీ రాజకీయార్థశాస్త్ర అధ్యాపకులు, ఇరవై సంవత్సరాలుగా ప్రత్యామ్నాయ ఆల్టర్నేటివ్స్ అనే పత్రికను, ఆ పత్రిక కేంద్రంగా ఆల్టర్నేటివ్స్ మూవ్‌మెంట్ అనే ఆలోచనా బృందాన్ని నడుపుతున్నారు).

అనువాదకుడి మాట: తెలుగు పాఠకులకు అందాలనే కోరికతోనే ఈ అద్భుతమైన వ్యాసాన్ని అనువదించాను. అయితే ఎంత నచ్చిన విషయంలోనైనా ఒక నచ్చని అంశం ఉంటుంది. ఎంతనచ్చని విషయంలోనైనా ఒక నచ్చిన అంశం ఉంటుంది. తొంభై తొమ్మిది నచ్చిన అంశాలున్న చోట కూడా ఒక నచ్చని అంశం ఉండవచ్చు. తొంభైతొమ్మిది నచ్చని అంశాలతో పాటు ఒకనచ్చని అంశం ఉండవచ్చు. అలా ఈ వ్యాసం అనువాదంతో పాటు రెండు అంశాలు సూచించాలని నాకు అనిపిస్తున్నది.

1) సంఘీభావం, న్యాయం, అంతర్జాతీయత, స్వేచ్ఛ అని స్థూల స్థాయిలో పూర్తిగా అంగీకరించదగిన అంశాలు చర్చించిన ఈ వ్యాసం వర్గపోరాటాన్ని, వర్గపోరాట అవసరాన్ని ప్రస్తావించకపోవడం ప్రధాన లోపమని నాకనిపిస్తున్నది. కరోనా వైరస్ మహమ్మారి ప్రస్తుత పాలనా నియమాలను మార్చడాన్ని ఆకాంక్షిస్తున్నదంటే అర్థం ఈ పాలకవర్గాలను కూలదోయమనే ఆదేశాన్ని ఇస్తున్నదే. మరి పాలకవర్గాలు తమ అధికారాన్ని ఎలా వదులుకుంటాయి, ఎలా మారుతాయి?వర్గ పోరాటం తప్ప మరొక మార్గమేది లేదు. ఆపోరాటం ఎలా జరుగుతుందనే అంశం చర్చనీయాంశం కావచ్చు. భిన్నాభిప్రాయాలుండవచ్చు. కాని వర్గపోరాట ప్రస్తావన కూడా లేకపోవడం ఉచితం కాదు.

2) బుజ్గాలిన్ కూడా 'నయా ఉదారవాద' అనే మాట వాడడం, అలాగే బూర్జువా, పెట్టుబడిదారీ, సామ్రాజ్యవాదం అని వాడవలిసినచోట'ఉదారవాద' అని వాడడం నాకు ఆశ్చర్యం కలిగించింది. పెట్టుబడిదారీ విధానం ప్రారంభదశలో, స్వేచ్ఛా వ్యాపార దశలో, భూస్వామ్య వ్యతిరేక దశలో 'ఉదారవాద' విలువల్ని ప్రచారం చేసింది. అప్పడు దాన్ని ఉదారవాద అనిపిలవడం కొంతైనా ఉచితం కావచ్చు. కాని అది వలస వాద, సామ్రాజ్యవాద,గుత్తాధిపత్య, ద్రవ్యపెట్టుబడి, దశలో ప్రవేశించాక ఆ ఉదారవాదం విలువలన్నింటిని వదులుకుంది. భూస్వామ్యంతో మిలాఖత్తయింది. కుళ్లిపోయి మరణశయ్య మీదికి చేరింది.అంటే పందొమ్మిదో శతాబ్దం చివరికే దానిలో 'ఉదారవాదం' ఏమీ మిగలలేదు. ఇక 1970ల తర్వాత రాజ్య నియంత్రణలు రద్దు కావాలనీ,స్వేచ్ఛా వ్యాపారానికి అనుమతించాలనీ, మళ్లీ ఒకసారి ద్రవ్యపెట్టుబడి నినదించడం మొదలు పెట్టినప్పుడు దాన్ని 'నయా ఉ దారవాదం' అనడం మొదలైంది. పాతదీ ఉదారవాదం కాదు, కాని సామ్రాజ్యవాద

సంస్థలూ, ప్రచార సాధనాలూ ప్రారంభించిన ఈ 'నయా ఉదారవాదం' అనే మాట చాలా మంది అనాలోచితంగా స్వీకరించారు. మార్క్సిస్టు పరిభాషలో సామ్రాజ్యవాదం అనదలచుకోని మార్క్సిస్టు మేధావుల దగ్గర నుంచి పత్రికల భాషతో ప్రభావితమయ్యే అమాయకుల దాకా ఎందరో ఈమాటను పరిశీలించకుండా వాడుతున్నారు 'సామ్రాజ్యవాదం' అనే మాట వాడడానికి భయపడే పార్లమెంటరీ కమ్యూనిస్టులు 'నయా ఉదారవాదం' అనే మాట ఎక్కువగా వాడుతున్నారు. ఈవ్యాసంలో బుఖారిన్ కూడా అదే మాట వాడారు గనుక అనువాదంలో నేను అదే ఉంచానుగాని, ఈ ఏవరణ అవసరం అనుకున్నాను)

(రష్యన్ నుంచి ఇంగ్లీష్: రెన్ ఫ్రె క్లార్క్:తెలుగు : ఎన్. వేణుగోపాల్)

వీక్షణం ఆగస్టు సంచిక సౌజన్యంతో

---

3. హేతువాదమంటే

హేతువాదమంటే-సహేతువాదమే
శాస్త్రీయపు ఆలోచన సారమే ఇది
సమసమాజ భావాలకు దారియే ఇది! ॥హేతు॥
ఛాందసత్వపూ-మూఢాచారపూ
నీతి బాహ్యపూ-హేతుదూరపూ
గత సంస్కృతి గతించా
మత సంస్కృతి నశించా
మనిషి మనిషిగా ఎంచా
మానవతా రహింప చేయు॥హేతు॥
కులముల కుళ్ళు నిండినా
కాలదోషం పట్టికుళ్ళిన
నరనరాల కర్మభావం
నిండిపండిన ఈ జగాన
మనిషీ మనిషీ వెన్నుతట్టి
దోపిడి కథా ముందుపెట్టి
సమసమాజ దారిలోన సాగిపోవు ॥హేతు॥
మనిషి అంటే చాలదోయ్- ఆలోచించాలి
ఆలోచనతో ఆగకోయ్ ప్రశ్న రావాలి
ప్రశ్న ప్రశ్నగా మిగలకుండా అన్వేషించాలి
అన్వేషించే దారిలో శాస్త్రీయత అవసరం
అదే ప్రగతికి తొత్త వెలుగును అందించును
ఇది నిజం ॥హేతు॥

4. పారదర్శకతే న్యాయవ్యవస్థకు ప్రాణం

ఇటీవల కాలంలో ఆంధ్రప్రదేశ్ హైకోర్టు ధర్మాసనం చేసిన కొన్ని వ్యాఖ్యలు కొన్ని పత్రికల్లో పతాక శీర్షికలు అయ్యాయి. 'న్యాయవ్యవస్థపై ఎవరికైనా విశ్వాసం లేకపోతే పార్లమెంట్‌కు వెళ్లి హైకోర్టును మూసివేయాలని కోరవచ్చున'న్నది వాటి సారాంశం. ప్రజాస్వామ్యం మూడు స్తంభాలపై ఆధారపడి ఉందని, న్యాయం అనే స్తంభం బలహీనమైతే అది అంతర్యుద్ధానికి దారితీస్తుందని, ధర్మాసనం వ్యాఖ్యానించిందని కూడా పత్రికలు రాశాయి. ఈవ్యాఖ్యలు అసాధారణమైనవి. హైకోర్టుపై ప్రచార మాధ్యమాల్లో వెలువడుతున్న బహిరంగ వ్యాఖ్యలు , విమర్శలపై ధర్మాసనం ఇలా స్పదించిందని ఆవార్తల సారాంశం. వాస్తవంలో న్యాయవ్యవస్థ బలహీనమైపోలేదు.నిస్సహాయ స్థితిలో పడనూలేదు. 'రాష్ట్రంలో చట్టబద్ధ పాలన(రూల్ ఆఫ్ లా) సరిగ్గా అమలు జరగడంలేదు. అది జరగకపోతే మేమే ఇతర నిబంధనల ప్రకారం అధికారాన్ని వినియోగిస్తామ'ని ధర్మాసనం అనడమే అందుకు నిదర్శనం.

రాజ్యవ్యవస్థలో భాగమైన మూడు వ్యవస్థలు- శాసన, కార్య నిర్వాహక, న్యాయ వ్యవస్థల్లో న్యాయ వ్యవస్తకు రాజ్యాంగం ప్రకారం విశేషమైన స్థానం ఉంది. అధికారాలు కూడ ఉన్నాయి.శాసనవ్యవస్థ చేసిన చట్టం రాజ్యాంగ విరుద్ధమని భావిస్తే, ఆ చట్టాన్ని కొట్టివేసే సమీక్షాధికారం న్యాయవ్యవస్థకు ఉంది. ఇలాంటి పరిస్థితుల్లో హైకోర్టును మూసివేయడం అనే ప్రశ్నే తలెత్తకూడదు. ఆ తరహా వ్యాఖ్య ధర్మాసనం నుంచి రాకూడదు. న్యాయవ్యవస్థ అనేది ప్రజల అవసరం. ప్రధానంగా బలహీనవర్గాలకు దాని అవసరం ఎంతో వుంది. దేశంలో మిగిలిన రెండు వ్యవస్థలూ ప్రజల విశ్వాసాన్ని కోల్పోయిన ప్రస్తుత పరిస్థితుల్లో తమకు జరిగే అన్యాయాన్ని సరిదిద్దడానికి న్యాయస్థానాలను ఆశ్రయించవచ్చును అనేభావం అందరిలో ఏర్పడింది. రాజ్యాంగాన్ని, చట్టాన్ని , ప్రజల హక్కులనూ పరిరక్షిస్తూ న్యాయస్థానాలు ఉత్తర్వులూ, తీర్పులూ జారీచేసినప్పుడల్లా ప్రజలు స్వాగతిస్తున్నారు. అందుకు భిన్నమైన తీర్పులు వెలువడినప్పుడు ఆమోదించలేకపోతున్నారు. భిన్నాభిప్రాయాలు కూడా వ్యక్తం చేస్తున్నారు. అయితే అవి ఉద్దేశాలు ఆపాదించేలా ఉండకూడదు. అలా చేస్తే చర్య తీసుకోవడానికి కోర్టు ధిక్కార చట్టం ఉండనే ఉంది. విమర్శల విషయంలో న్యాయమూర్తులు సంయమనంతో ఉదాత్తంగా వ్యవహరించాలనే భావన కూడా సుప్రీంకోర్టు పలు సందర్భాల్లో వ్యక్తం చేసింది.

ప్రజాభిప్రాయమే సుప్రీం:

ఇక్కడ గమనించలసిన ముఖ్య విషయం ఏమంటే న్యాయమూర్తులు ఇచ్చే తీర్పులు నూటికి నూరుపాళ్లూ న్యాయబద్ధంగా ఉంటున్నాయని చెప్పలేం. అవి తప్పనిసరిగా సామాజిక ప్రయోజనం కలిగి ఉన్నవేనని కూడా ఆమోదించలేం. కనుకనే దిగువ కోర్టులు ఇచ్చే ప్రతి తీర్పుని పై కోర్టులు ఖాయం చేయడంలేదు. అందుకు ఉదాహరణలు కోకొల్లలు. సుప్రీంకోర్టు తీర్పును అంతిమ తీర్పుగా

భావించడానికి కారణం అంతకుమించి పై కోర్టు దేశంలో లేకపోవడమే. ఆంధ్రప్రదేశ్ హైకోర్టు ఉత్తర్వులూ, తీర్పులపైన ప్రస్తుతం ప్రజల్లో విస్తృతమైన చర్చే జరుగుతుంది. చర్చను తప్పుపట్టవలసిన అవసరంలేదు. అది ప్రజల జ్ఞానానికి , చైతన్యానికి నిదర్శనం కావొచ్చును. ఆంధ్రప్రదేశ్‌లో అధికార పార్టీ, ప్రతిపక్షాల మధ్య పరిస్థితి అగ్గిమీద గుగ్గిలంలా ఉంది. మరోవైపు ప్రతిపక్ష స్థానం కోసం టీడీపీ, బీజేపీల మధ్య ఉన్న పోటాపోటీ అగ్నికి ఆజ్యం పోస్తోంది.
మరి ఈ ఉత్తర్వుల మాటేమిటి?:అయితే కొన్ని ఉత్తర్వులు చట్టపరంగా లేవని నద్విమర్శలు చేయడం కూడా తప్పనిసరి అవుతోంది. ఉదాహరణకు రాజధాని ప్రాంతంలో భూముల బదిలీకి సంబంధించిన తుళ్లూరు మాజీ తహసీల్దార్ కేసులో అసలు దర్యాప్తే జరపరాదని హైకోర్టు స్టే ఇవ్వడాన్ని సుప్రీంకోర్టు ఆమోదించలేదు. వారం రోజులు గడువు ఇచ్చి తేల్చవలసిందిగా హైకోర్టును సుప్రీం కోర్టు కోరింది. అలాగే గత అడ్వకేట్ జనరల్‌తోపాటు సుప్రీంకోర్టు న్యాయమూర్తి ఇద్దరు కుమార్తెలు నిదితులుగా ఉన్న ఏసీబీ ఎఫ్ఐఆర్ కేసులో కూడా అసలు దర్యాప్తే జరపవద్దని ఉత్తర్వులు జారీచేయడం అసాధారణం. అదే ఉత్తర్వులో మాజీ అడ్వకేట్ జనరల్‌తోపాటు అసలు కోర్టు ముందుకురాని నిందితులపై కూడా ఎలాంటి నిర్బంధ చర్యలు తీసుకోరాదని చెప్పడం మరింత అసాధారణం. ఇందుకు దారితీసిన అసాధారణ పరిస్థితులు ఏమిటో ఆ ఉత్తర్వులో హైకోర్టు చెప్పలేదు. అలాంటి ఉత్తర్వులపై సహజంగానే ప్రజల్లో చర్చ జరగుతుంది. అందునా రాజధాని వ్యవహారాలతో ముడిపడి ఉన్న కేసులు గనుక ఆ చర్చ ఉద్రేకపూరితంగా కూడా ఉ ంటుంది. ఆంధ్రప్రదేశ్ హైకోర్టు రాష్ట్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా తీర్పులు ఇస్తున్నదనే ప్రచారం నడుస్తున్న మాట వాస్తవం. హైకోర్టు రాజ్యాంగ ప్రకారం తీర్పులు ఇవ్వడం తప్ప అవి ప్రభుత్వానికి వ్యతిరేకమూ,అనుకూలమా...వాటిని ప్రతిపక్షాలు ఎలా అనుకూలంగా మలుచుకునే ప్రయత్నం ఎప్పుడూ చేస్తూనే ఉంటాయి. కనుకనే ఇటీవల హైకోర్టు ధర్మాసనం చేస్తున్న వ్యాఖ్యలు పత్రికల్లో పతాక శీర్షికలయ్యాయి. అలా చేయడంలో ఆ పత్రికలకు ఎలాంటి స్వప్రయోజనాలు లేవని భావించగలమా? వాటి వెనుక రాజకీయ నాయకుల ప్రయోజనం ఉండదని అనుకోగలమా? ఈ నేపథ్యంలోనే ఈమధ్య ఒక నిర్మాణాత్మకమైన సూచన వచ్చింది. న్యాయమూర్తులు చేసే వ్యాఖ్యలు తీర్పులో భాగం చేయాలన్నదే దాని సారాంశం.

మన దేశంలో న్యాయవ్యవస్థను, ఆ మాటకొస్తే అన్ని వ్యవస్థలనూ స్వప్రయోజనాల కోసం ఉపయోగించుకునే ఆధిపత్య కులాలు, సంపన్నవర్గాలు పార్టీలు లేకపోలేదు. అధికారంలో ఉన్నప్పుడూ, లేనప్పుడూ కూడా రాజ్యాంగ వ్యవస్థల్లో తమ ఏజెంట్లను ఎలా చొప్పించి ఉంచాలో ఈ వర్గాలకి బాగా తెలుసు. కనుకనే చుండూరు, అంతకుముందు కారంచేడు కేసుల్లో తీర్పులు అలా వచ్చాయి. కారంచేడు కేసులో కిందికోర్టు విధించిన శిక్షలను సుప్రీంకోర్టు ఖరారు చేసింది. ఇక రిజర్వేషన్లపై సీలింగ్ వ్యవహారంకూడాఅంతే. ఇందిరా సాహ్నీ కేసులో రిజర్వేషన్లు 50 శాతం మించరాదని సుప్రీం కోర్టు సీలింగ్ విధించింది. కానీ ఆర్థికంగా బలహీనవర్గాల పేరిట 10శాతం రిజర్వేషన్లు 103వ రాజ్యాంగ సవరణ ద్వారా

అదనంగా కల్పించి ఆ రిజర్వేషన్లను 60శాతం కు పెంచినప్పుడు మాత్రం అది స్టే ఉత్తర్వులు ఇవ్వలేదు. ఇక ఉన్నత న్యాయస్థానాల్లో న్యాయమూర్తుల నియామకంలో సామాజిక న్యాయం మచ్చుకైనా కనిపించదు. రాజ్యాంగ పీఠికలోనే మూడు లక్ష్యాలు-సామాజిక, ఆర్థిక, రాజకీయ న్యాయాలను మన రాజ్యాంగ నిర్మాతలు ప్రస్తావించారు.

మొదటగా చెప్పిన సామాజిక న్యాయం ఎందుకు అమలుకావడం లేదు? రాజ్యాంగ వ్యవస్థలో న్యాయవ్యవస్థ అంతర్భాగం కనుక రాజ్యవ్యవస్థకు ఉండే సంపన్న వర్గ స్వభావం న్యాయవ్యవస్థకు కూడా ఉంటుందని ఒకప్పటి కేరళ ముఖ్యమంత్రి మార్క్సిస్టు నాయకుడు నంబూద్రిపాద్ వ్యాఖ్యానించారు. ఒక్క సంపన్నవర్గ స్వభావంమాత్రమే కాదు. కుల వ్యవస్థ లోతుగా పాతుకుపోయియున్న మన దేశంలో రాజ్యవ్యవస్థలో భాగంగాఉన్న న్యాయవ్యవస్థకు ఆధిపత్య కుల స్వభావం కూడా ఉంటుందనేది కూడా మౌలిక సత్యం. ఆ వ్యవస్థ నిర్భయంగా,పక్షపాతరహితంగా, పారదర్శకంగా, స్వతంత్రంగా వ్యవహరించాలని నూటికి ఎనభైమందిగా ఉన్న బహుజనులు కోరుకుంటున్నారు.

వ్యాసకర్త హైకోర్టు న్యాయవాది, ఆంధ్రప్రదేశ్ కన్వీనర్ సెంటర్ ఫర్ సోషల్ జస్టిస్.
మొబైల్ 9849856568. (01-10-2020 సాక్షి సౌజన్యంతో)

---

5. కరోనా దెబ్బకు గుళ్ళు, గోపురాలు, మసీదులు, చర్చీలు ఠా!!

కరోనా మహమ్మారి దెబ్బకు మానవ మాత్రులేగాక అన్ని మతాల దేవుళ్ళు,గుళ్ళు, గోపురాలు, మసీదులు, చర్చీలు గా(చా)వు కేకేలుపెడుతున్నాయి. పూజలు, నమస్కారాలు, ప్రార్థనలు, మత వేడుకలు, సమస్తం 'ఠా' అన్నాయి. భక్తులు లేక పూజారులు, ఫాదర్లు, ముస్లిం మతాధికారులు బోరుమన్నారు. వాటి 'ఆదాయం-కానుకలు, వగైరాలు కృశించుకుపోయాయి. సేవలు ఉసూరుమన్నాయి!

తిరుపతి తిరుమంత్రం: ప్రకృతి ప్రకోపాలు, ప్రపంచ యుద్ధాల కాలంలో కూడా బ్రహ్మోత్సవాలు లక్షలాది మూఢ జన సంద్రం మధ్య వైభవోపేతంగా జరిగేవి. కానీ కరోనా దెబ్బను మాత్రం తట్టుకోలేక పోయాయి. ఊరేగింపులు, విహారాలు, పూజారులకే పరిమితమయ్యాయి. ఆ వరుసలో తిరుపతి ఆదాయం కూడా అట్టడుగుకు చేరుకుంది. తిరుపతి వెంకటేశ్వర్లుకు, ఆయన పూజారులకుగాని వారి పూజలు-మంత్రాలు కానీ ఏమీ పనిచేయలేదని తెలుస్తుంది. కరోనాతో తిరుపతి ప్రధాన అర్చకుడు మృతి! పైగా తిరుపతి ప్రధాన అర్చకుడిగా పనిచేసిన 75 ఏళ్ల శ్రీనివాసమూర్తి దీక్షితులు కరోనా తో ఆసుపత్రిలో చికిత్స పొందినప్పటికీ అయన ప్రాణాలు హరీమన్నాయి. గత 20 ఏళ్లుగా వెంకటేశ్వర్లు పూజలు చేసినప్పటికీ తిరుపతి దేవుడితో సహా ఏ దేవుడూ కరోనా వ్యాధి నుండి ఆయనను రక్షించలేకపోయాడు. అంత్యక్రియలు కూడా వారి సాంప్రదాయపద్ధతిలో జరుపలేక పోయారంటే లేని దేవుడు గొప్పా?అలుముకున్న కరోనా మహమ్మారి ప్రభావమా ? అనేది తేలటం లేదా?

ఏతావాతా , ఏ దేవుడు లేడని కరోనా నిరూపించింది. దేవాలయాల్లోని దేవుళ్లు, వాళ్ల మహిమలు హుళక్కి అని తేల్చింది. కరోనా ముందు పూజారులు, ఆచార్యులు, ఫాదర్లు, ఇమాంల దైవ ప్రార్థనలు ఎందుకు కొరగావని నిర్ధారితం కాలేదా!

6. కుబుసం విడిచిన కుసంస్కారం

జనారణ్యంలో మదోన్మత్త మానవ క్రూరమృగాలు నిస్సహాయ లేడి కూనలను వేటాడుతూ వినోదిస్తున్న అంతులేని కథలో మరో విషాద ఘట్టమిది. 'ఉన్నావు' తరహా ఉదంతం నేపథ్యంలో ఉత్తరప్రదేశ్‌లోని హాథ్రస్ జిల్లా బుల్‌గర్హి గ్రామం పేరిప్పుడు దేశ విదేశాల్లో మార్మోగుతోంది. పందొమ్మిదేళ్ల దళిత యువతిపై అదే ఊరి` చెందిన నలుగురి అమానుష దమనకాండ వింటే ఎవరికైనా ఒళ్ళు గగుర్పొడుస్తుంది. గడ్డి కోసుకోవడానికి తల్లితోపాటు పొలాల వద్దకు వెళ్లిన ఆ అభాగ్యురాలు మృగాళ్ల పాలబడి కడకు ఢిల్లీ సఫ్దర్‌జంగ్ ఆసుపత్రిలో చేరితే పక్షం రోజుల విఫల పోరాటం దరిమిలా విగత జీవురాలైంది. ఆమె వెన్నెముక ఛిద్రమైంది. నాలుక కోసేశారు. తల్లి వెతుక్కుంటూ వచ్చేసరికి ఒంటి మీద దుస్తులు లేని స్థితిలో కంటపడిన ఆ అమ్మాయి సామూహిక అత్యాచారానికి గురైందన్నది పచ్చి అసత్య ప్రచారమని ఉత్తరప్రదేశ్ పోలీసు గణం సెలవిచ్చిందంటే ఏమనుకోవాలి. ఘటన చోటుచేసుకున్న 96 గంటల్లోపే కీలక సాక్ష్యాధారాల సేకరణ జరిగి తీరాలన్న నిబంధనల్ని తుంగలో తొక్కిన పోలీసులు,అమెను ఆసుపత్రికి తరలించిన 11రోజుల తరవాత తీరిగ్గా విశ్లేషణలు చేపట్టి 'గ్యాంగ్ రేప్' ఆరోపణలు బూటకమని అడ్డగోలుగా నిర్ధారించారు. బాధితురాలి మరణ వాంగ్మూలాన్ని దారుణంగా అపహసించారు. 'ఏ ఠాకూర్ సంతానమో అయితే నా బిడ్డకు ఈ గతి పట్టేదా?...దళితులుగా పుట్టడమే మా ఖర్మ 'అని గుండెలు బాదుకుంటున్న ఆ కన్నతల్లి ఆక్రందనలకు ఎవరు సమాధానం చెప్పగలరు?

సామూహిక అత్యాచారమన్నది పచ్చి అబద్ధమని చాటడానికే పోలీసుల ఘనత పరిమితం కాలేదు. ఆసుపత్రిలో ప్రాణాలు విడిచిన యువతి శవాన్ని కుటుంబ సభ్యులకు అప్పజెప్పలేదు. ఎవరి ఆదేశాలో తు.చ. తప్పకుండా పాటిస్తున్న చందంగా, బాధితురాలి భౌతిక కాయాన్ని ఊరికి తరలించి చీకటిమాటున రాత్రి రెండున్నర గంటలవేళ హడావుడిగా శవ దహనం కానిచ్చేశారు. అవమానకరమైన రీతిలో అంత్యక్రియలు జరిపించారన్నది చిన్న మాట. వాళ్లు- సంస్కారానికి అక్షరాల నిప్పుపెట్టారు!

తమకు మాట మాత్రంగానైనా చెప్పకుండా అపరాత్రి వేళ శవదహనం చేయడమేమిటన్న ఆ కుటుంబ సభ్యుల సూటిప్రశ్నకు ఇప్పటికీ సరైన సమాధానం దొరకలేదు. హాథ్రస్ యువతి విషాదాంతం దేశాన్ని పట్టి కుదిపేస్తుండగానే, అదే యూపీలోని బలరామ్‌పూర్‌లో అటువంటి దుర్ఘటనే పునరావృతమైంది. కళాశాలలో ప్రవేశం కోసం వెళ్లిన 22 ఏళ్ల యువతిని ముగ్గురు మృగాళ్లు అపహరించుకుపోయి సామూహిక అత్యాచారానికి పాల్పడ్డాక, తీవ్రగాయాలూ రక్తస్రావంతో ఆ అభాగిని మృతిచెందింది. ఆసుపత్రినుంచి మృతదేహాన్ని తీసుకెళ్లిన పోలీసులు మొన్న బుధవారం రాత్రి ఆదరాబాదరా ఆమె అంత్యక్రియలు నిర్వహించారు. ఎవరెంతగా ఛీత్కరించినా తమ తీరు మారేది కాదని యూపీ పోలీసులు నిర్లజ్జగా చాటుకుంటుంటే- దోషుల్ని ఉపేక్షించేదిలేదని ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి యోగి

ఆదిత్యనాథ్ ఘనంగా చెబుతున్నారు. ఎస్పీతోపాటు కొందరు అధికారులపై వేటువేసి, ప్రత్యేక దర్యాప్తు బృందం(సిట్) నియమించినట్లు ఆయన ప్రకటించారు. సిట్ వేశారు సరే, బాధిత యువతి కుటుంబంతో ఎవరూ మాట్లాడకుండా ఊళ్లో బారికేడ్లు ఏర్పాటు చేసి, హాథ్రస్ జిల్లా అంతటా సెక్షన్ 144 విధించి-ఏం దాచిపెట్టడానికి ప్రభుత్వ యంత్రాంగం అంతగా తాపత్రయపడినట్టు? కాస్తోకూస్తో నగదు, భూమి ఆశ చూపి బాధిత కుటుంబాల నోరు మూయించే యత్నాలు చూడబోతే -అక్కడి సర్కారు ఎవరి కొమ్ము కాసే కృషిలో తలమునకలై ఉందో ప్రస్ఫుటమవుతూనే ఉంది.

ఆధునిక భారతంలో ఆగకుండా సాగుతున్న మానభంగ పర్వంలో యూపీ ఖ్యాతి మరెంత విస్తారమైనదో జాతీయనేర రికార్డుల బ్యూరో (ఎన్‌సీఆర్‌బీ) తాజా నివేదికాంశాలు చాటుతున్నాయి. దేశంలో నిరుడు మహిళలపై అత్యాచారాలు, హింసాకాండ ,వేధింపులు,దాడులకు సంబంధించి నమోదైన కేసులు నాలుగు లక్షలకు మించిపోయాయి. అందులో యూపీ వంతు దాదాపు అరవైవేలు పవిత్ర భారతావనిలో, ప్రతి రోజూ నగటున 87 అత్యాచారాలు నమోదవుతున్నాయి. వెలుగు చూడని ఘోరాలు మరెన్నో ఎవరికెరుక! 'ఇండియా అంటే నేరాలు, అత్యాచారాలు తప్ప మరేమీ కానట్లుంది' అని బాంబే హైకోర్టు, 'నేనుపుట్టి పెరిగిన భారతదేశ మౌలిక సంస్కృతి ఇది కానే కాదు' అని అరుంధతీరాయ్ వంటి వారు ఆక్రోశించ దం-భీతావహ దుస్థితిని కళ్లకు కడుతుంది. ఆ మధ్య అనంతపురంలో తొమ్మిదో తరగతి విద్యార్థినిపై ఓ ట్యాక్సీ డ్రైవరుతో పాటు ఆమె సొంత అన్నయ్య నైచ్యానికి తెగబడడం, నల్గొండ జిల్లాలో తొంభై ఏళ్ల వృద్ధురాలిపై హత్యాచారం-లైంగిక హింస దిగ్భ్రాంతికర స్థాయికి చేరిన వైనాన్ని స్పష్టీకరిస్తోంది. తాను భద్రంగా ఉన్నానని భారత మహిళ ఎప్పుడు భావించగలుగుతుంది అని 2013 గాంధీ జయంతి నాడు నరేంద్ర మోదీ ట్వీట్ చేశారు. ఏడు సంవత్సరాలు గిర్రున తిరిగినా, సరైన జవాబు కోసం దేశ ప్రజలు నేటికి నిరీక్షిస్తూనే ఉన్నారు.

అరచేతిలో ఇమిడే స్మార్ట్ ఫోన్లు, అంతర్జాల విప్లవాలను వెన్నంటి అశ్లీల వెబ్‌సైట్ల ఉరవడి యువతలో పశువాంఛను ప్రేరేపించి నైతిక విలువలకు తలకొరివి పెడుతోంది. చట్టాలు రూపొందించడంతోనే ఘోరాలకు నేరాలకు అడ్డుకట్ట పడబోదని పదేపదే రుజువవుతోంది. దేశంలో ఎక్కడ ఏమూలనైనా లైంగికహింస, స్త్రీలపై దాడులను ఉక్కు పాదంతో అణిచివేసేలా హుటాహుటి విచారణ, సత్వరమే కఠిన దండనలకు ప్రభుత్వాలు సర్వసన్నద్ధమై ఉంటే- అసలు ఇన్ని దారుణాలను దేశం చూడాల్సి వచ్చేదా? ఇప్పటికైనా అవి మేలుకొని-మద్యపానం, మాదకద్రవ్యాలు, అశ్లీల వీడియోల విష సంస్కృతిని అరికట్టాలి. ఆడపిల్లల పట్ల మర్యాద మన్ననలు చూపి, వారి భద్రతకు బాధ్యత వహించాలన్న సంస్కార బీజాలు పిల్లల మెదళ్లలో నాటుకునేలా ప్రాథమిక స్థాయినుంచీ పాఠ్యాంశాల కూర్పును ప్రక్షాళించాలి. సమాజంలో కుసంస్కారం, దురహంకారం కుబుసం విడిస్తేనే, అత్యాచారాలు ఇంతగా పేట్రేగిపోవు. చట్టబద్ధంగానూ, సంస్కారయుతంగాను పకడ్బందీ చికిత్స ఒక్కటే అందుకు సరైన విరుగుడు! ఏమంటారు?

(ఈనాడు04-10-2020 సౌజన్యంతో)

7. విశ్వ పరిణామానికి ఓ నవీన కోణం?!

చెట్టుపై ఉన్న పండు గాలిపోదలించినప్పుడు పైకి ఎగిరిపోకుండా కింద భూమ్మీద పడిపోవడానికి కారణం ఏమిటని ప్రశ్నించుకున్న ప్రసిద్ధ భౌతిక శాస్త్రవేత్త న్యూటన్ గురుత్వాకర్షణ శక్తి నిరూపణకు సిద్ధమయ్యాడు. అలాగే ఈవిశ్వం నిరంతర పరిభ్రమణంలో ఉన్న ఏకైక శ్రమజీవి ప్రకృతి(ఎ సర్వైవల్ సర్క్యులేటరీ వర్కర్ ఆఫ్ ది వరల్డ్) అలాగే మానవ విజయాలకు మార్గం వ్యక్తి జన్మకాదు. అతని మేధస్సు, తెలివితేటలు. అది ప్రజాస్వామిక విద్యా విధానం ద్వారా మాత్రమే సాధ్యమని డార్విన్ ప్రవచించాడు. పరిణామపు ఊయల గురించిన వైజ్ఞానిక శాస్త్రకథా సంపుటిలలో రచయిత చరిత్ ఈ ఊయలకు మూలం ఆర్యుల పుట్టుపూర్వోత్తరాలన్న ఉపశీర్షిక పెట్టారు. ఈసైన్సు కథలను 400పేజీల్లో 17వ్యాసాల ద్వారా నడిపాడు. ఈ రచనలో మానవుల ప్రగతి, దాన్ని అదుపు చేయచూసే మానవుడిలోని కానరాని రాక్షస స్వరూపాన్ని ఆవిష్కరించడానికిప్రయత్నించాడు.

విశ్వపరిణామ క్రమాన్ని కొత్త కోణాలనుంచి ఆవిష్కరించాలన్న తాపత్రయానికి ముందు ఆర్యుల పుట్టుపూర్వోత్తరాలను తెలుసుకునే జిజ్ఞాసను ప్రదర్శిస్తున్న డాక్టర్ చరిత్ పట్టుమని 35 ఏళ్ల వయస్సు కూడా దాటని జీవ వైద్యశాస్త్ర ఇంజనీర్. ఫార్చ్యూన్ 500 కంపెనీలో ఉద్యోగం చేస్తూనే సర్వ విషయాలపై సాధికారత సాధించాలన్న తపన ఉన్నవాడు. కనుకనే ఔత్సాహిక పారిశ్రామిక వేత్తగా,ఒక డాక్టరేట్‌గా, ఒక రచయితగా,వాద్యకారుడిగా,పలు రంగాలలో పరిచయం ఉన్న యువకుడు చరిత్.న్యూయార్క్ విశ్వవిద్యాలయంలో చేరి పట్టభద్రుడై అడ్వాన్స్‌డ్ టెక్నాలజీ అభ్యసించేందుకు జర్మనీ వెళ్ళాడు. మహాపండితుడు రాహుల్ సాంకృత్యాయన్‌లా లోక సంచారం చేస్తూ ప్రపంచ దేశాల సాంప్రదాయాలను, సంస్కృతులను, మతవిశ్వాసాలను, ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని ఆకళింపు చేసుకుంటూ నూతన అనుభవాల కోసం మోసులెత్తినవాడు చరిత్. ఆయన గమ్యాన్ని తీర్చిదిద్దడానికి తోడునీడైన జర్మన్ సతీమణి చరణీ చరిత్.జనన మరణాలకు తేడాలేదని, పుట్టిన ప్రతిదీ చస్తుందని బోధించిన బుద్ధుడిలాగానే నమ్ముతాడు చరిత్. అయితే సత్యం ఉపరితలాన్ని మాత్రమే తడుముతున్నందున విశ్వపరిణామం లోతుపాతుల్ని పూర్తిగా తెలుసుకోలేక పోతున్నామన్న బాధను వ్యక్తంచేస్తాడు. అందుకే మనిషి వేల సంవత్సరాలలో గడించిన వైజ్ఞానిక సంపదను కోల్పోకుండా సంస్కృతపరుడుగా మెలగాలంటే యుద్ధాలు ఉండకూడదని భావిస్తాడు చరిత్. అనేక బడా విదేశీ గ్రంథాలయాల్లోకి క్రీపూ.14.000 సంవత్సరాల నాటివిగా చెబుతున్న వైదిక ప్రాచీన సాహిత్యం నకలు ఎలాచేరాయన్న ప్రశ్నను చరిత్ తన గ్రంథంలో సంధించాడు. అక్కడ రక్షణ లేకుండా ఎలా, ఎందుకు నిరాధారంగా పడి ఉన్నాయని ప్రశ్నించాడు. అంతేకాదు ఆనాడు ఎదుగూ బొదుగూ లేని పిట్టల్లాంటి పొట్టివాళ్లు. అంటుకట్టే (క్లోనింగ్)కృత్రిమ ప్రయోగాల ద్వారా ప్రాచీనులు మరుగుజ్జుల ద్వారా భీషణ యుద్ధాలు నిర్వహించారా అని ప్రశ్నిస్తాడు. ఇందుకు ఉదాహరణగా చరిత్, ప్రాచీన భారతీయులు 'అంటుకట్టే

రసాయన ప్రక్రియ' ద్వారా ఇతర జీవుల జీవ కణాలతో అనుసంధానం చేసి యుద్ధ పిపాసుల్ని ప్రాచీనులు సృష్టించి ఉంటారని, లేకపోతే ఒకే వయస్సులో ఒకే ముఖ కవళికలున్న 100 మంది కౌరవుల్ని మానవాతీతులైన సూపర్ హ్యూమన్ సైనికులుగాచూపడం-సాధ్యపడదని, కేవలం ఈ అసాధారణ లక్షణం 'క్లోనింగ్' ప్రక్రియ ద్వారానే సాధ్యపడిఉంటుందని చరిత్ గ్రంథంలోని ఒక పాత్ర ద్వారా చెప్పిస్తాడు. ఒకే పిండాన్ని గర్భవిచ్ఛిత్తి ద్వారా కుండల్లో పెంచడం ద్వారా కౌరవుల్ని సృష్టించారని,ఇదే అంటుకట్టడమని , మానవ పరిణామ చరిత్ర పూర్వాపరాల చర్చ ద్వారా నిరూపించడానికి ఒక ప్రయత్నం జరిగింది. భారతంలో గాంధారికి సహజంగా సంతానం కలగనప్పుడు కృత్రిమ సంతానాన్ని ఈ 'క్లోనింగ్' ద్వారానే సాధ్యం చేశారని కాబట్టి ప్రాచీనులకు ఈ టెక్నిక్ తెలుసుననీ, టెస్ట్ ట్యూబ్ బేబీలను పిండ విచ్ఛిత్తి ద్వారా కృత్రిమంగా సృష్టించడం తెలుసునని, అదే క్లోనింగ్ అని చరిత్ తన 'అర్యుల పుట్టు పూర్వాల' రచనలో చెప్పించాడు. అందువల్ల ఆధునిక విజ్ఞాన శాస్త్రానికి ఈ రహస్యం పూర్తిగా తెలిసినట్టుగా భావించరాదని కూడా ఒక 'ఊహ'ను ఈ గ్రంథంలో ప్రతిపాదించడం జరిగింది.

మతం, మాతృభూమి, కుటుంబ వ్యవస్థ, జీవితం ప్రారంబం,ముగింపు దశల గురించిన ప్రశ్నోననిషత్తు తనకు ఎదురైనప్పుడు ఈ సంశయాలన్నీ చుట్టుముట్టాయి. బహుశా ఆలోచనాపరులందరికి నిద్రకు ఉపక్రమించేముందు ఈసమస్యలు కళ్లముందు పరుచుకుంటాయి. అలాంటి ఘడియల్లో అతడి చేతికి దొరికిన పుస్తకం పరిణతి చెందిన ప్రాచీన భారత నాగరికత' అనే గ్రంథం (అడ్వాన్స్‌డ్ ఏన్షియయంట్ ఇండియన్ సివిలైజేషన్) ప్రాచీన భారతంలో కృత్రిమ పద్ధతుల్లో అంటుకట్టడం ద్వారా పిండోత్పత్తి క్రమాన్నిజయప్రదంగా నియంత్రించవచ్చని ఇది వివాదాస్పదంగానే సాక్ష్యంగా ప్రాచీనులు భావించారని,విశదీకరించిన వైజ్ఞాన శాస్త్ర రచనను డాక్టర్ చరిత్ అధ్యయనం చేశాడట. రుజువైన ఈకృత్రిమ గర్భోత్పత్తి(క్లోనింగ్) విధాన ప్రక్రియ జ్ఞాన పరంపరను తర్వాతి తరాలు ఎందుకు భద్రపరుచుకోకుండా అశ్రద్ధ వహించాయి.?ప్రాచీన హైందవ నాగరికతలోని ఈరహస్యాలు ఎలా కోల్పోయాం? అలాగే భాలీస్థాయిలో మానవ విధ్వంసాత్మక ఆయుధాలు 10,000-20,000 సంవత్సరాలుగా ఉన్నాయన్న వాదన నిజమైతే; ఆవాదన కల్పితమా లేక అల్లిన ఒక సైన్సు కథా? నాడు అనలింతకూ అలాంటి ఆయుధాలు ఉన్నాయనడానికి సాక్ష్యాధారం ఉందా? అమాటకొస్తే ఎన్ని రకాల మొక్కల్ని పూవుల్ని కృత్రిమంగా రంగంలోకి నేడు దించడంలేదు? మానవ ప్రకృతి లోనే కాదు, ప్రకృతి ప్రసాదించిన ఎన్నో ప్రాచీన వృక్ష జాతులకు,పండ్ల ఉత్పత్తికి చెందిన కృత్రిమ వంగడాలు ఇప్పుడు మార్కెట్‌ను ముమ్మరించడం లేదు? వాదన కోసం చరిత్ ఎన్ని ఉప వాదాలు ప్రతిపాదించినా 'గీత'పాత్ర ద్వారా ఈ 'పరిణామ చరిత్ర' రహస్యాన్ని మరోరూపంలో చూపక తప్పలేదు. ఆసక్తికల్గించే ఒక విషయాన్ని మీకు చెప్పదలిచాను. క్రీపూ 14,000 సంవత్సరాల తర్వాత మాత్రమే ప్రజలు దేవుళ్లను, మతాలను తమ తమ కళాఖండాల్లోనూ, వృత్తి చిహ్నాలలోనూ చిత్రించడం ప్రారంభించారు. కానీ, అంతకుముందటి తరాలక మాత్రం దేవుళ్లను గాని, ఏ మతాన్నిగాని నమ్మినట్టు ఆరాధించినట్టు దాఖలాలు లేవు(చరిత్‌గ్రంథం పే.54)

బహుశా అన్ని వేల సంవత్సరాల తర్వాత కూడా 19-20శతాబ్దికిచెందిన మహాకవి గురజాడ 'మీ పేరేమిటి' అన్న కథలో 'దేవుడు చేసిన మనుషుల్లారా/ మనుషులు చేసిన దేవుళ్లారా,మీపేరేమిటి? అని ప్రశ్నించాల్సి వచ్చింది. మహాపండిత రాహుల్జీ సింధూనాగరికత గురించి , రుగ్వేద ఆర్యుల గురించి ప్రస్తావిస్తూ వారు నగర విధ్వంసకులని, భిన్న జాతుల్నీ కష్టజీవులైన ప్రాచీన తెగల్ని హింస ద్వారా చెండుకు తిన్నారని, సింధు నదీ తీరవాసులైన హరప్పా-మొహెంజదారో నాగరికతకు నిజమైన వారసులు, అనార్య తెగలేనని, మానవ నాగరికత ప్రస్థానంలో ఓల్గానది నుంచి గంగానది వరకు సాగిన మానవ వలసలన్నీ ఈ మహాప్రస్థానంలో భాగమేనని, యుద్ధరంగంలో పురుషులకు ధీటుగా సమంగా సహకరించినవారు కిరాత జాతులుగా ఆర్యులు వర్ణించే అతి పేదసాదలైన కష్టజీవులైన స్త్రీలేనని రాహుల్జీ ప్రశంసించారు. ఇందుకు తిరుగులేని సాక్ష్యం కిరాతజాతి (పర్వతవాసులు) నాయకుడైన శంబరుడి కూతురు 'శంభు' కిరాత పేదల్ని హింసిస్తున్న ఆర్యులలో భాగమైన ఆనాటి వ్యాపారి(పణి) కొడుకు అమ్మా నన్ను రక్షించు' అన్నప్పుడు ఆశత్రువు బిడ్డను మాతృ భావనతో ఎత్తుకుని ముద్దాడి పెంచిన మాతృమూర్తి 'శంభు' అందుకే ప్రత్యక్ష జ్ఞానాన్ని మించిన దైవం లేదని, నీకు మెదడన్నది ఉంది కాబట్టి. దాన్ని నమ్ముకోమని బోధించిన వాడు బుద్ధుడు. చివరికి తాను చెప్పినా సరే నీ సొంత మనస్సుతో వాస్తవాన్ని దర్శించుకున్న వాడు బుద్ధుడు.

అందుకే గురజాడ మహాకవి జ్ఞాని అయిన బౌద్ధాన్ని భారతదేశ సరిహద్దులు దాటించి, దేశం ఆత్మహత్య చేసుకుందని మరీ హెచ్చరించి పోయాడు. అలాగే ప్రకృతిని స్వార్థ ప్రయోజనాల కోసం చేజేతులా ధ్వంసం చేసుకుంటున్న మనం, చేతులారా 'భస్మాసుర హస్తాల' సృష్టికర్తలం కాకూడదని, అలాకాదని అణ్వాయుధ సంపదను పెంచుకోవడం కోసం ప్రపంచవ్యాపిత సర్వ విధ్వంసానికి చేజేతులా మనం-సర్వ రంగాలలో ప్రగతిపథంలో ఉన్న మనం-దోహదకారులం కాకుండదని తెలుగు యువమేధావి డాక్టర్ చరిత్ ఈ గ్రంథం ద్వారా అందిస్తున్న పండితార్థం.

(29-09-2020 సాక్షి సౌజన్యంతో (ఎ.బి.కె.ప్రసాద్, అసమాన సీనియర్ సంపాదకులు)

---

8. ముక్తి పేరిట విశృంఖల శృంగారం

ఫ్రాన్సు దేశస్థుడు రాయల్ నాయకత్వంలో ఏర్పాటైన ఆధ్యాత్మిక బృందం 'మానవ కానింగ్' ద్వారా ముక్తి పొందవచ్చుననే కొత్త సిద్ధాంతాన్ని ప్రతిపాదిస్తున్నారు. తమకు85 దేశాల్లో 35వేల మంది అనుచరులు ఉన్నట్టు చెప్పుకుంటున్న ఈబృందాలు స్విట్జర్లాండులోని ఆల్ప్‌పర్వతాల సమీపంలోని క్రీడల హోటల్‌లో ఇటీవల సమావేశమైనప్పుడు ఒక అనుచరుడు తాము ధరించే చిహ్నాన్ని ప్రదర్శించాడు. మూఢభక్తులకు తప్ప ఇతరులకు అనుమతిలేని ఈ సమావేశాల్లో విశృంఖల శృంగారం చోటుచేసుకుంటుందనే ఆరోపణలు రాగా వారి కార్యకలాపాలను తాము నిశితంగా గమనిస్తున్నామని స్విస్ పోలీసులు ప్రకటించారు. హత్యలకూ, స్వీయహత్యలకు పురికొల్పి అంతర్జాతీయస్థాయిలో సంచలనం సృష్టించిన సోలార్ టెంపుల్ బృందానిదీ .ఆల్ప్‌పర్వతాలే కేంద్రస్థానంగా ఉన్న విషయం విదితమే. (24-8-97వార్త)

9. ఒకే దేశం, ఒకే పార్టీ, ఒకే చట్టం, ఒకే మతం సాధ్యమా?

ఆగస్టు 5వ తేదీనాడు అయోధ్యలో భవ్యమైన బాల రామాలయ నిర్మాణానికి భారత ప్రధానమంత్రి ఆధ్వర్యంలో భూమిపూజ జరిగింది. స్వాతంత్ర్యం వచ్చిన తొలిరోజుల్లో సోమనాథ్ దేవాలయ పునరుద్ధరణ కార్యక్రమాల ప్రారంభానికి హాజరయ్యేందుకు అప్పటి ప్రధాని పండిత్ నెహ్రూ నిరాకరించారు. ఒక మతానికి చెందిన ఆలయ కార్యక్రమానికి ప్రధానమంత్రి హోదాలో హాజరవడం లౌకికత్వానికి విరుద్ధమని ఆయన భావించాడు. అప్పటికి భారత రాజ్యాంగ పీఠికలో సెక్యులర్ అనే మాటలేదు. 1976లో అప్పటి ప్రధానమంత్రి ఇందిరా గాంధీ ఆధ్వర్యంలో 42వ రాజ్యాంగ సవరణ ద్వారా సెక్యులర్ , సోషలిస్టు పదాలను పీఠికలో చేర్చారు. ఇప్పుడు రామాలయ నిర్మాణ భూమిపూజకు ప్రధానమంత్రి హాజరవడం, స్వయంగా అర్చన తానై నిర్వహించడంపై కొంతమందికి భిన్నాభిప్రాయాలు ఉన్నా విస్తృత ప్రజాభిప్రాయానికి భయపడి మౌనంగా ఉండిపోయారు.

అయోధ్య వివాదం కారణంగా శతాబ్దాల తరబడి రామజన్మభూమి వివాదాల్లో చిక్కుకోవడం, కొన్ని దశాబ్దాలుగా ఒక రాజకీయ అంశంగా మారడం చరిత్రలో ఒక విచారకరమైన అధ్యాయం. ఎట్టకేలకు సర్వోన్నత న్యాయస్థానం తీర్పు ఈ అధ్యాయానికి తెరదించింది. ప్రభుత్వ ఆధ్వర్యంలోని ట్రస్టు ద్వారా ఆలయ నిర్మాణం జరగాలని, కోర్టు ఆదేశించినందువల్ల కూడా ప్రధానమంత్రి హాజరును ఎవరూ పెద్దగా తప్పుపట్టలేకపోయారు.

నెహ్రూ జమానా నుంచి మోదీ హయాం వరకు ఆరేడు దశాబ్దాల కాలంలోనే సెక్యులరిజం,సోషలిజం వంటి అంశాలపై ప్రజల ఆలోచనా రీతుల్లో చోటుచేసుకున్న మార్పులు మనకు స్పష్టంగా కనిపిస్తున్నాయి. అటువంటప్పుడు వేల ఏళ్లనాటి శ్రీరామచంద్రుని విలువలూ, ఆదర్శాలు ఇప్పటి తరానికి ఏ మేరకు ఉపయుక్తం అవుతాయని ప్రశ్నించేవారు తప్పకుండా ఉంటారు. శూద్రులు సేవకులుగానే ఉండాలి తప్ప, తపస్సు చేయడానికి యోగ్యులు కారనే బ్రాహ్మణ పండితుల ఆదేశంతో శీర్షాసనం వేసి ఘోరమైన తపస్సు చేస్తున్న శంభూకుని తలను నరికివేస్తాడు ధర్మ ప్రభువు శ్రీరాముడు. పద్నాలుగేళ్లపాటు వనవాసాన్ని ఓపెన్ జైలు జీవితాన్ని అనుభవించిన సీతమ్మ తల్లిని అగ్ని పరీక్షకు రాముడు ఆదేశిస్తాడు. ఇటువంటి చర్యలు ప్రజలకు ఏ సందేశాన్నిస్తాయని ప్రశ్నించేవాళ్లు ఇప్పుడే కాదు, ఆ రోజుల్లోనూ ఉన్నారు. వారి వాదనల్ని పండితులు చార్వాక వాదమని కొట్టిపడేసేవారు.వాస్తవానికి చారువాక్కు అంటే మంచి మాట అని అర్థం. మంచిమాటలు చెప్పేవాళ్ళు చార్వాకులు కానీ పండితుల అణచివేతలకు గురైనందువల్ల ఆమాట ఒక దుష్ట పదంగా మిగిలిపోయింది. చార్వాకవాదాలు చేసేవాళ్లను ఇప్పుడు సోషల్‌మీడియా పండితులు కమ్యూనిస్టులు, సెక్యులరిస్టులుగా బ్రాండింగ్ చేశారు. ఆ రెండూ గొప్ప మాటలే అయినప్పటికి ఇప్పుడు సోషల్ మీడియా లో, మీడియాలో కూడా వార్ వన్ సైడే కనుక, చివరికి పాపం అలా మిగిలిపోయారు వాళ్ళు. రామతత్వంలోని మిగిలిన ఆదర్శాల సంగతెలా ఉన్నా ఒకే బాణం, ఒకేమాట,

సంఘ పరివారాన్నీ, భారతీయ జనతా పార్టీని బాగా ప్రభావితం చేసినట్టు కనబడుతుంది. రామాలయానికి భూమి పూజ జరిగిన ఆగస్టు 5వ తేదీకి సరిగ్గా ఏడాది ముందు అదే తేదీనాడు ఒక దేశం, ఒకేచట్టం అనే తన చిరకాల స్వప్నాన్ని మోదీ ప్రభుత్వం సాకారం చేసుకున్నది. దేశంలో ఎక్కడా పెద్ద వ్యతిరేకత కనిపించనీయకుండా 370వ అధికరణంను చాకచక్యంగా రద్దుచేయగలిగింది. కశ్మీర్‌కు ప్రత్యేక హోదా కాదు గదా, రాష్ట్ర హోదా కూడా మిగల్లేదు. భూమిపూజ తర్వాత రెండురోజులకే ప్రధానమంత్రి ఒక సెమినార్‌లో మాట్లాడుతూ "ఒకే దేశం-ఒకే విద్య" అని మరో పిలుపునిచ్చారు. ఈ మేరకు నూతన విద్యావిధానాన్ని ఇప్పటికే కేంద్ర కేబినెట్ ఆమోదించింది. విద్య ఉమ్మడి జాబితాలోని అంశం.రాష్ట్రాల ప్రత్యేక పరిస్థితులు, అవసరాలపై విస్తృతమైన చర్చ జరగకుండానే కేంద్రం ఏకపక్ష నిర్ణయం ఎలా తీసుకుంటుందనే ప్రశ్న ఎక్కడా తలెత్తకపోవడం పెద్ద విశేషం. ఇప్పుడున్న విద్యావిధానం రాజీవ్‌గాంధీ ప్రధానిగా ఉన్నప్పుడు అమల్లోకి వచ్చింది. ఆదర్శాలెలా ఉన్నా ఆచరణలో ఈ విధానం విద్యను అంగడి సరుకుగా మార్చివేసింది. ఈ చేదు అనుభవం ఫలితంగానే, కొత్త విద్యావిధానాన్ని పలువురు స్వాగతిస్తున్నారు. ప్రైవేటు దోపిడీదార్ల పాలిట కామధేనువులాంటి ఇంటర్మీడియెట్ అదృశ్యం కాబోతుంది.ఈ కొత్తవిధానం అమల్లోకి రావడానికి అటంకాలేవీ కనిపించంలేదు. ఒకే దేశం, ఒకేచట్టం, ఒకే విద్య తర్వాత వచ్చే ఆ ఒక్కటీ ఏమై ఉంటుంది.?

ఈవరుసలో భాష కూడా ఉంటుందా? భారతీయ జనతాపార్టీకి మాతృసంస్థ లాంటిదైన ఆర్ఎస్ఎస్ భావజాలంలో దేశ ప్రజలంతరూ హిందీ నేర్చుకోవాలన్న లక్ష్యం కూడా అంతర్భాగం. అయితే గతంలో నాన్-హిందీ రాష్ట్రాల్లో ఈ అభిప్రాయం పట్ల వ్యక్తమైన వ్యతిరేకత వల్ల ప్రస్తుతానికి బీజేపీ ఈ అంశాన్ని చేపట్టకపోవచ్చు. కానీ, నూతన విద్యావిధానంలో భాగంగా ఐదో తరగతి వరకు మాతృభాషలోనే (ప్రాంతీయ భాష) చదివించాలన్న అంశాన్ని ముందుకు తెస్తున్నారు. దేశ వ్యాప్తంగా కూడా విద్యార్థుల తల్లిదండ్రులు ఇంగ్లీష్ మీడియం వైపు మొగ్గుచూపుతున్న సందర్భం ఇది. ఇంగ్లీష్ మీడియంలో ప్రాథమిక విద్యను అభ్యసించిన పిల్లలు, ఉన్నత విద్యలో మెరుగైన ప్రమాణాలతో అభివృద్ధిలో దూసుకుపోతున్న వాస్తవికత వారి కళ్లముందున్న కారణంగా ఈ పరిణామం ఏర్పడింది. దేశ ఆర్థిక వ్యవస్థలో వస్తూత్పత్తి రంగమో వ్యవసాయ రంగమో కీలకపాత్ర పోషించే దేశాల్లో మాతృభాషలో చదివించినా సరిపోతుంది కానీ సేవా రంగంపై ఆధారపడిన దేశాల్లో ఇంగ్లీష్ మీడియం చదువు అత్యవసరమని నిపుణులు భావిస్తున్నారు. మన దేశ జీడీపీలో సేవారంగం వాటా సగానికన్నా ఎక్కువ. ఈ పరిస్థితుల్లో కేంద్రం మాతృభాషా ఫోకస్ వెనుక వ్యూహమేమిటో తేలాల్సి ఉన్నది.

ఒకే చట్టం,ఒకే విద్య తర్వాత ఒకే జాతీయ పార్టీ అనేది బీజేపీ లక్ష్యంకావచ్చు.ఇందులో దాపరికమేమిలేదు, 'కాంగ్రెస్ ముక్త భారత్' తన విధానంగా బీజేపీ ఎప్పుడో ప్రకటించుకున్నది. కాంగ్రెస్‌పార్టీ పూర్తిగా పతనమైతే ఇక మిగిలే జాతీయపార్టీ బీజేపీ ఒక్కటే. మిగిలిన జాతీయ పార్టీలు పేరుకే తప్ప వాటి ఉనికి నామమాత్రమే. దేశంలో ఉన్న 28రాష్ట్రాలలో కేవలం 8 రాష్ట్రాలలో మాత్రమే కాంగ్రెస్

తన ఉనికిని బలంగా చాటుకునే పరిస్థితిలో ఉన్నది. అందులో జ్యోతిరాధిత్య సింధియా , సచిన్ పైలట్ల రూపంలో రెండు రాష్ట్రాల్లో గట్టి ఎదురుదెబ్బలే తగిలాయి. భారత రాజకీయాల్లో మితవాదానికి, వామపక్షానికి నడుమ మధ్యేవాద పార్టీగా కాంగ్రెస్ పార్టీ ఒక సుస్థిర స్థానాన్ని ఏర్పాటుచేసుకుని యాభై ఐదేళ్లపాటు పరిపాలించగలిగింది. ఈ స్థానంలో కూడా ఎక్కువకాలం వామపక్షానికి దగ్గరైన మధ్యేవాద పార్టీ (లెఫ్ట్ ఆఫ్ ది సెంటర్)గా వ్యవహరించింది. మొన్నటి ఎన్నికలకు ముందు రాహుల్‌గాంధీ శివభక్తుని గెటప్‌లో మెతక హిందుత్వ కార్డును ప్రయోగించి బొక్కబోర్లా పడ్డారు. కాంగ్రెస్ పార్టీ గడియారం ముల్లు రైట్ ఆఫ్ ది సెంటర్ స్థానంలో నిలబడింది. తన సాంప్రదాయ విధానానికి భిన్నంగా ఆర్టికల్ 370 రద్దు విషయంలో పెద్దగా అభ్యంతరాలు లేవనెత్తకుండానే వదిలేసింది. ఇప్పుడు సాక్షాత్తు కాబోయే కాంగ్రెస్ సేనాని ప్రియాంక గాంధీ రామమందిరం భూమి పూజను బహిరంగంగా స్వాగతించారు. ఈ నేపథ్యంలో బీజేపీకి బీ టీంగా కాంగ్రెస్ పార్టీ రూపాంతరం చెందుతుందని పరిశీలకులు భావిస్తున్నారు.

'ఏ' టీమ్ అందుబాటులో ఉన్నప్పుడు 'బి' టీమ్‌ను ఎంచుకునేదెవరు? ఇప్పటికే జాతీయ స్థాయిలో బీజేపీ విజయయాత్ర ఉచ్ఛదశకు చేరుకున్నట్టే. రాష్ట్రాల స్థాయిలో ప్రాంతీయ పార్టీలు,సెంటర్, లెఫ్ట్ ఆఫ్ ది సెంటర్ స్థానాలను ఆక్రమించాయి. దక్షిణాదిలోని నాలుగు రాష్ట్రాలు మినహా మిగిలిన అన్ని రాష్ట్రాల్లోను బీజేపీ ప్రధాన పోటీదారుగా తయారైంది. జాతీయ స్థాయిలో నాయకత్వ లోపం తెలంగాణ కాంగ్రెస్‌కు శాపంగా మారితే ఇక్కడ కూడా రెండోపార్టీగా బీజేపీ ఎదిగే అవకాశాలు కనబడుతున్నాయి.

అశోక చక్రవర్తి కళింగ యుద్ధంలో చాలా కర్కశంగా వ్యవహరించాడని, నెత్తుటేర్లను పారించాడని చరిత్ర చెబుతున్నది. ఈయుద్ధంలో గెలిచిన తర్వాత కావేరీ దక్షిణాన కొద్ది ప్రాంతం మినహా ప్రస్తుత అఫ్ఘనిస్తాన్ సహా ఉపఖండమంతా అశోకుని పరిపాలనలోకి వచ్చింది. గెలవడానికి ఇంకేమి మిగల్లేదు. అప్పుడాయన తన శేషజీవితాన్ని బౌద్ధధర్మ ప్రభోదానికి అంకితం చేశాడు. అదే తరహాలో జాతీయస్థాయి ఏకైక విపక్షమైన కాంగ్రెస్ పార్టీ కునారిల్లిపోయిన స్థితిలో నరేంద్రమోదీ రామాలయానికి భూమిపూజ చేసి ప్రసంగించారు. శ్రీరామచంద్రుని ఆదర్శాలతో కూడినదే మహాత్ముడు కలలుకన్న రామరాజ్యమని, దానిని స్థాపించడమే తన ధ్యేయమని ప్రకటించుకున్నారు. రామమందిరం పూర్తయ్యే నాటికి ఒక దేశం-ఒకే జాతీయ పార్టీ అనే భావన కూడా స్థిరపడుతుందేమో చూడాలి.(09-08-2020సాక్షి)

హేతువాద జోహార్లు!!!

ఇటీవల అమరులైన విజయవాడ నాస్తిక కేంద్రం నిర్వాహకులు విజయం గారికి, మానవ వికాస వేదిక రాష్ట్ర నేత, మ్యాజిక్ ప్రదర్శనలు ఇచ్చిప్రజలను చైతన్య పరచడంలో అంకితమైన ఎన్.విక్రం గారికి హేతువాదం పత్రిక తరుపున, తెలంగాణ రాష్ట్ర హేతువాద సంగం తరుపున హేతువాద జోహార్లు అర్పిస్తున్నాం!!

కాంతికార్, ప్రధాన సంపాదకులు, హేతువాదం, రాష్ట్ర అధ్యక్షులు,
తెలంగాణ రాష్ట్ర హేతువాద సంఘం

10. కోర్టు ధిక్కార నేరాలు ఇంకా అవసరమా?

భారత సంవిధానం ఆర్టికల్ 19(1)(ఎ)లో పౌరులదరికి వాక్ స్వాతంత్రం
ఉన్నా కోర్టు ధిక్కారం చేస్తే శిక్ష విధించే అధికారం కోర్టులకు ఉందంటున్నది.
న్యాయస్థానాల తీర్పులను సమంజసంగా విమర్శించవచ్చునని,వారికి వ్యక్తిగత
దురుద్దేశాలను ఆపాదించకుండా అభిప్రాయ వ్యక్తీకరణ చేయవచ్చునని కోర్టు
ధిక్కార చట్టం వివరించింది. రంజన్ గొగోయ్ లైంగిక వేధింపుల కేసును వేగంగా
ముగించి బాధితురాలిని బయటకు గెంటి ప్రధాన న్యాయమూర్తిని నిర్దోషిగా
ప్రకటించినప్పుడు సుప్రీంకోర్టు, హైకోర్టు న్యాయమూర్తులతో సహా చాలామంది
మౌనంగా ఉండడం కూడా భావవ్యక్తీకరణ హక్కు వినియోగమే.ఎవరిష్టం వచ్చిన
ట్టు వారుమాట్లాడకూడదు.కానీ ఎవరిష్టం వచ్చినట్టు వారునోరు మూసుకుని ఉండొచ్చు

కోర్టు ఆదేశాలను ఉల్లంఘించడం సివిల్ పరమైన తప్పిదం. న్యాయమూర్తి
వ్యతిరేక తీర్పు చెప్పినందుకు కోపించి, కోర్టులోనే చెప్పు విసరడం, తిట్టడం, అరవడం
పైపైకి వెళ్లడం కోర్టు ధిక్కార నేరాలు, కోర్టుకిచ్చిన ప్రమాణ పత్రాలలో చేసిన
వాగ్దానాలు అమలు చేయకపోయినా కోర్టు ధిక్కారమే. వీటితోపాటు నిందాత్మక
విమర్శలు అనే నేరం మరొకటి ఉంది. మామూలు కేసుల విచారణ నింపాదిగా
దశాబ్దాల పాటు సా..గు..తుంది. కానీ రాజ్యాంగ అధికారాలను వినియోగించి
పెద్ద న్యాయస్థానాలు కోర్టు ధిక్కారం కేసులు స్వీకరిస్తే, శరవేగంగా జరుగుతాయి.
దీన్ని సమ్మరీ హియరింగ్ అంటారు. కోర్టు ధిక్కారం కేసులో పెద్దగా రుజువు
చేయవలసిన అంశాలేమీ ఉండవు. నిందితుడు చేసిన వ్యాఖ్యానాలు ప్రింట్‌లోనో,
వీడియోలోనో, సోషల్‌మీడియాలోనో భద్రంగా ఉంటాయి. అబద్దాలు చెప్పి రేపులు,
హత్యలు చేయలేదని చెప్పుకోవచ్చేమోకాని 'కోర్టు ధిక్కారమా నాకు తెలియదు,
నేను చేయలేదు అని తప్పించుకోలేరు.

ప్రశాంత్ భూషణ్‌తోపాటు కోర్టు ధిక్కారం కేసులో ట్విట్టర్ కంపెనీవారు
కూడా నిందితులు. క్షమాపణతో వారు బయటపడ్డారు. అయితే రెండు ట్వీట్లను
వారు మళ్లీ ప్రచారంలో పెట్టకూడదు. ట్వీట్ కవులు, వాట్సాప్ విద్వాంసులకు
ఇచ్చిన తీవ్రమైన హెచ్చరిక సుప్రీంకోర్టు తాజా తీర్పు. సుప్రసిద్ధ న్యాయవాది ప్రశాంత్
భూషణ్ రెండు ట్వీట్లు ఆయనను దాదాపు జైలుకు పంపేవే. రూపాయి జరిమానాతో
ఆయనకు జైలు తప్పిపోయింది. సుప్రీంకోర్టు ముగ్గురు జడ్జీల న్యాయస్థానం ప్రశాంత్
భూషణ్ నేరం చేశారని అందుకు ఆయన శిక్ష అనుభవించాల్సిందేనన్నది. ఒకవేళ
ఆ రూపాయిచెల్లించకపోతే మూడు నెలలు సాధారణ జైలు జీవితం గడపాలని
నిర్దేశించింది. బయటకి వచ్చిన తరువాత మూడు సంవత్సరాల పాటు సుప్రీం
కోర్టులో ప్రాక్టీసు చేయకూడదని నిషేధించింది. వీటికన్నా రూపాయి చెల్లించడం
నయమని తెలిసి తమ ఉత్తర్వును వెంటనే పాటిస్తారని సుప్రీంకోర్టు చాలా కరెక్టుగా
అంచనా వేసింది.కోర్టు ధిక్కారం చేసిన నేరగాళ్లందరినీ,అంతే దయతో
చూస్తుందని గ్యారంటీ లేదు. కొందరు ప్రముఖులకు ఎక్కువ సమానత
సమర్థనీయం అంటారు. ప్రశాంత్‌భూషణ్ అన్నటువంటి మాటలే ఇదివరకు కేరళ

ముఖ్యమంత్రి నంబూద్రిపాద్ మాట్లాడారు. సుప్రీంకోర్టు యాభైరూపాయల జరిమానాతో ముగించింది. మనతెలుగు నేత శివశంకర్ కేంద్రంలో న్యాయశాఖ మంత్రి ఓ అడుగు ముందుకువేసి 'ఫెరా ఉల్లంఘించే వారికి,వధువులను తగుల బెట్టేవారికి, జమీందార్లకి మన సుప్రీంకోర్టు స్వర్గం వంటిది. అన్నారు. కానీ అది ఒక అభిప్రాయం. విమర్శఅనీ, కోర్టు ధిక్కారం ఎంత మాత్రం కాదని సుప్రీంకోర్టు వదిలేసింది. శివశంకర్ అన్నారుకదా అని మనమెందుకు రాయకూడదని ఫేస్‌బుక్, ట్విటర్లలో టకాటకా కామెంట్లు కొడితే చకాచకా కటకటాలకు పోవలిసి వస్తుంది. రాజద్రోహం, కోర్టు ధిక్కార నేరంవంటి ఈ భయానక శాసనాలు బ్రిటీష్ పాలకులకు అవసరమయ్యాయి. బ్రిటన్‌తో సహా అనేక దేశాలు ఈ నేరాలను తీసేసి నాగరికుల య్యారు.మనమే ఇంకా రాజభక్తితో ఈ నేరాలను బతికించి స్వేచ్ఛాజీవులుగా మరణిస్తున్నాం.పౌరసమాజం, ఈ అన్యాయ, బానిస, భయానక, అప్రజాస్వామికనేర శాసనాలను సంవిధానపు పుటలనుంచి నిర్మూలించేందుకు ఉద్యమాలు నిర్మించాల్సిందే.(వ్యాసకర్త బెన్నెట్ విశ్వవిద్యాలయాచార్యులు)(11-10-2020సాక్షి నుండి

---

11. విభజన దృష్టి వద్దు

ప్రశ్నించటం...పౌరుల గొంతు నులిమితే న్యాయవ్యవస్థకే కాదు మొత్తం ప్రజాస్వామ్యానికే అన్యాయాలపై ఇక గొంతెత్తే వారే ఉండరు. భయంతో ఏ గొంతులూ పెగలకుంటే అరిష్టాలకు అడ్డూ అదుపు ఉండదు. అప్పుడు వ్యవస్థలన్నీ గతి తప్పుతాయి. అరాచకం రాజ్యమేలుతుంటి. ఇంతటి తీవ్ర ప్రమాదం ముంచుకు రాకుండా పౌరులకు.రాజ్యాంగం కల్పించిన హక్కులకు రక్షణ ఉండాలి. సద్విమర్శకు తావుండాలి. కోర్టుల పరువు , ప్రతిష్ఠను నిలపాలి. ప్రజాస్వామ్యపు వివిధ అంగాల మధ్య సంఘర్షణ తుది ఫలితం మధ్యేమార్గం. ఉభయతారకంగా ఉండాలి. అంతేతప్ప ఒకదాని కోసం మరోటి బలిపెట్టకూడదు. కోర్టుల పరువు నిలపాలనే తొందరలో పౌర హక్కుల్ని కాలరాయొద్దు. పౌర హక్కుల పేరిట వ్యవస్థల గౌరవాన్ని నేల పాలితంగా నేలకు దించొద్దు. ప్రముఖ న్యాయవాది, పౌరహక్కుల కార్యకర్త ప్రశాంత్ భూషణ్ ను కోర్టు ధిక్కారం కేసులో దోషిగా సుప్రీంకోర్టు ధర్మాసనం తేల్చినకేసు గురువారం కొత్త మలుపు తిరిగింది. శిక్ష ఖరారు చేయాల్సిన దశలో నానా పరిణామాలు చోటుచేసుకున్నాయి. ట్వీట్‌లలో చేసిన వ్యాఖ్యల పునరాలోచనకు రెండు, మూడు రోజుల సమయం ఇస్తున్నట్టు ధర్మాసనం ప్రకటించింది. తప్పు గ్రహించి, పశ్చాత్తాపం ప్రకటిస్తే తప్ప శిక్ష విషయంలో మరో అభిప్రాయానికి తావు లేదంది. తన అభిప్రాయంలో మార్పులేదని, తాను ఆ వ్యాఖ్యలు పూర్తి ప్రజ్ఞతోనే చేసినందున పునరాలోచన ఉండబోదని భూషణ్ నిర్ద్వంద్వంగా చెప్పారు. తీర్పు తనను కలతకు గురిచేసిందని , శిక్ష గురించి కాదు, న్యాయస్థానం తనను తప్పుగా అర్థం చేసుకుందని,శిక్ష గురించికాదు, న్యాయస్థానం తనను తప్పుగా అర్థం చేసుకుందని, దురుద్దేశాలు ఆపాదించి ఆధారాలు చూపకుండానే దోషిగా తేల్చడం బాధించిందని, తెలిపారు. మహాత్మా గాంధీ ఒక కేసులో కోర్టు ముందు వెల్లడించిన భావాల్ని గుర్తుచేస్తూ 'దయ చూపమని అడగను, ఉదారత కోసం

కోరను,ప్రజాస్వామ్య పరిరక్షణకు బహిరంగ విమర్శ తప్పనిసరి అని భావించా, బాధ్యతగానే వ్యాఖ్యలు చేశాను. ఏ శిక్షకైనా సిద్ధమే. అని తెలిపారు. తదుపరి ఇక కోర్టుదే. దేశ వ్యాప్తంగా ఈ అంశం ఓ విస్తృత చర్చకు తెరలేపింది.న్యాయవ్యవస్థ పనితీరుతో పాటు పౌరుల హక్కులు, ప్రశ్న-నిరసన-విమర్శ వంటి పలు అంశాలు ప్రస్తావనకొస్తున్నాయి. విమర్శకు తావు లేని పరిస్థితి కల్పిస్తే ఇక రాజ్యాంగం పూచీగా నిలిచిన భావప్రకటన స్వేచ్ఛ(అధికరణం 19-(ఎ) హక్కు కున్న అర్థమేమిటనే ప్రశ్న తలెత్తుతోంది.

రెంటిని కలగాపులగం చేయొద్దు : రాజ్యాంగబద్ధమైన సంస్థల పనితీరు సజావుగా సాగేందుకు వాటి లోపాలు ఎత్తిచూపడం, సద్విమర్శ పౌరునిగా తన బాధ్యతఅని భావించినట్లు ప్రశాంత్‌భూషణ్ చెబుతున్నారు. నెలరోజుల వ్యవధితో ఆయన చేసిన రెండు ట్వీట్లు ప్రస్తుత వివాదానికికారణం ఒకటి, బయట సుప్రీం కోర్టు చీఫ్ జడ్జి ప్రవర్తనకు సంబంధించింది. ఇంకొకటి గత ఆరేళ్లుగా దేశంలో ఎమర్జెన్సీ విధించ కుండానే ప్రజాస్వామ్యంను బలహీనపరుస్తున్న తీరు. అదే (నలుగురు ప్రధాన న్యాయమూర్తులు)సమయంలో సుప్రీం కోర్టు పాత్ర గురించి చేసిన వ్యాఖ్య! ఈ రెండూ న్యాయవ్యవస్థ గౌరవాన్ని ప్రజల్లో విశ్వసనీయతను తగ్గించేవిగాఉన్నాయని సుప్రీం కోర్టు తన తీర్పులో పేర్కొంది. ఒక ఫిర్యాదు ఆధారంగా తనంత తాను సుప్రీం ఈ కేసును చేపట్టి సదరు చర్యను కోర్టు ధిక్కారంగా భూషణ్‌ను దోషిగా తేల్చింది. ఇది వివాదస్పదమౌతుంది. న్యాయస్థానాలపైనా, జడ్జీలపైనా ఇలాంటి విమర్శలు కొత్త కాదు 2018లో నలుగురు సుప్రీం కోర్టు సీనియర్ జడ్జీలు విలేకరుల సమావేశం పెట్టి, సుప్రీంకోర్టు పనితీరు అంత సవ్యంగా లేదు. ప్రధాన న్యాయమూర్తి పనికేటాయింపు ప్రక్రియ లోపభూయిష్టం అని విమర్శ చేశారు. అంతెందుకు కోర్టు ధిక్కారం కాలేదు? అన్నది ప్రశ్న అంటే ఒకే విషయంలో...న్యాయమూర్తులకు న్యాయ వాదులకు సాధారణ పౌరులకు వేర్వేరు న్యాయాలు ఉంటాయా? అనేది సందేహం. విమర్శకు, న్యాయ అధికారానికి మధ్య విభజన రేఖ గుర్తించాలి. రెంటిని ఒకేగాట కట్టడం తప్పని సుప్రీంకోర్టే తనతీర్పుల్లో పలుమార్లు పేర్కొంది. కోర్టు ధిక్కార చట్టం-1971సెక్షన్ 13 అదే చెబుతుంది. ఒక చర్య లేదా వ్యాఖ్య న్యాయ ప్రక్రియ నిర్వాహణలో తగినంత అనుచిత జోక్యమని సంతృప్తి చెందితే తప్ప దాన్ని కోర్టు ధిక్కారంగా పరిగణించకూడదన్నది చట్టం. తన వ్యాఖ్య సత్యమని, జనహితంలో చేసిందని నిరూపించుకునే నిందితుని వాదనకూ అవకాశం కల్పిస్తూ చట్ట సవరణ(13-బి) కూడా జరిగింది. నిఖార్సయిన విమర్శ కోర్టు ధిక్కారం కాబోదని ఇదే చట్టం(సెక్షన్-5) చెబుతోంది. దేశ విదేశాల్లో ఎందరెందరో న్యాయకోవిధులకు ఈవిషయంలో స్పష్టమైన తీర్పునిచ్చారు.

న్యాయవ్యవస్థలో అవినీతి లేదా? ట్వీట్‌లలో ఒక న్యాయవాది చేసిన రెండు వ్యాఖ్యలు న్యాయవ్యవస్థ ప్రతిష్టను భంగపరిచి , ప్రజల్లో విశ్వసనీయతను తగ్గిస్తాయన్న భావనతో ఉన్నత న్యాయస్థానం వ్యక్తి ప్రథమిక హక్కును నలిపివేయడాన్ని ప్రజాస్వామ్య వాదులు జీర్ణించుకోలేకపోతున్నారు. నిజంగా మన న్యాయవ్యవస్థ, కోర్టులు, మొత్తంగా ప్రజాస్వామ్యం ఈరోజు అంతటి బలహీన పునాదులపై

[illegible] అని ప్రశ్నిస్తున్నారు. బార్ (న్యాయవాదుల సంఘం) ను నోరు నొక్కాయించి న్యాయస్థానాన్ని బలోపేతం చేయలేరనే నినాదం దేశవ్యాప్తంగా వెల్లువెత్తుతోంది. కోర్టుల గౌరవాన్ని నిలబెట్టే ఉద్దేశంతో, వాటి పనితీరుపై ఎటువంటి వ్యాఖ్యలు చేయనీయకుండా పౌరుల భావప్రకటనా స్వేచ్ఛకుకోర్టుధిక్కార అస్త్రంతో ముందస్తు బంధనాలు విధించడం సబబా? తద్వారా కోర్టుల గౌరవం, విశ్వసనీయత పెరుగుతాయా? అంటున్నారు. 108 పేజీల తీర్పులో 'నాలుగు స్తంభాల్లో ఒకటిగానేకాదు. భారత ప్రజాస్వామ్యానికి న్యాయవ్యవస్థ మూలస్తంభం' అని పేర్కొన్న సర్వోన్నత న్యాయస్థానం. దేశంలో నెలకొన్న పరిస్థితులకూ బాధ్యత వహించాలన్న విమర్శను ఎందుకు స్వీకరించలేకపోయింది. ? వ్యాఖ్యను విమర్శగా కాకుండా కోర్టు ధిక్కారంగా ఎలా పరిగణించారనేది విస్మయం!'ఇప్పుడే కాద 16 మందిలో సగం మంది సుప్రీం ప్రధాన న్యామూర్తులు అవినీతిపరులన్న విమర్శ చేసినప్పుడు కూడా తన ఉద్దేశం కేవలం ఆర్థిక అవినీతికాదని. 'అవినీతి'ని విస్తృతార్థంలో వినియోగించానని న్యాయవాది ప్రశాంత్‌భూషణ్ ఆగస్టు 4న ఇచ్చిన వివరణలో ఆగస్టు10న కోర్టు ఆదేశాలకు బదులిచ్చినప్పుడు పేర్కొన్నారు. 'కింది స్థాయి న్యాయవ్యవస్థలో దేశమంతటా అవినీతి ఉంది. అక్కడక్కడ ఉన్నత స్థాయిలోకి విస్తరించిందని 1964లోనే పార్లమెంటరీ కమిటీ నివేదించింది. 'జడ్జీల్లోనూ అవినీతి పరులున్నార'ని మాజీ ప్రదాన న్యాయ మూర్తి ఎస్పీ బరూచా 'అవినీతి అంటుకోకుండా న్యాయవ్యవస్థ ఏమీ లేదని నేను నిజాయితీగా అంగీకరించాల్సిందే' అని మరో ప్రధానన్యాయమూర్తి సదాశివం బహిరంగంగా పేర్కొనడాన్ని భూషణ్ తన వాదనలో ఉటంకించారు. న్యాయ వ్యవస్థపై విమర్శ న్యాయధిక్కారమెలా, కోర్టు ధిక్కారమెలా అవుతుందన్న ఆయన ప్రశ్నకు సహేతుకమైన సమాధానం రావట్లేదు.

---

12. రూప చిత్రాలపై ముల్లాల ఆగ్రహం

సౌదీ అరేబియాకు [illegible] చిత్రకారుడొకరు [illegible] సికాల గల్ఫ్‌యుద్ధంలో పాల్గొన్న గల్ఫ్ దేశాధిపతుల [illegible] రూప చిత్రాలను చిత్రించారు. యుద్ధంలో అమెరికా దాడులను ఎదిరించి పోరాడిన సద్దాం హుస్సేన్ ఓటమికి చిహ్నంగా నిర్మించే మ్యూజియం (చిత్ర ప్రదర్శనశాల) లో వాటిని తరలించేంత వరకు వాటిని తన స్వదేశంలోనే భద్రపరుస్తున్నారు. ఇరాన్ దేశపు మధ్యవర్తి ద్వారా ఆచిత్రాలను 50లక్షల పౌండ్లకు (సుమారుగా 30కోట్ల రూపాయలు)కు కొని వాటిని బాహాటంగా తగులబెట్టాలని ఇరాన్ ముల్లాలు ప్రయత్నిస్తున్నారు. అది తెలుసుకున్న చిత్రకారుడు [illegible] వాటిని అమ్మకూడదని నిర్ణయించుకున్నాడు. మనుషుల రూపాలను చిత్రీకరించడాన్ని ఖురాన్ నిషేధిస్తున్నందున వాటిని తగులబెట్టాలని ముల్లాలు భావిస్తున్నారు. మతపరమైన అంశాలకు రాజకీయ కారణాలు తోడవుతున్నాయి. ఇరాన్‌లో షియా ముస్లింలు తీసుకువచ్చిన సోకాల్డ్ 'ఇస్లామిక్ విప్లవాన్ని' గల్ఫ్‌దేశాల్లోని సున్నీ ఇస్లామిక్ [illegible] నేరనివ్వడం లేదు. దుబాయ్ , బహ్రాయిన్ లాంటి చిన్న దేశాలలో రాజకీయ సుస్థిరతను దెబ్బతీయాలని ఇరాన్ ప్రయత్నిస్తుంది. ఈ రాజకీయ పరిణామాల నేపథ్యంలో గల్ఫ్ [illegible] రూపచిత్రాలను సేకరించి, వాటిని బాహాటంగా దగ్ధంచేయడం ద్వారా [illegible] (షియా) ముస్లింలు మాత్రమే ఇస్లామిక్ ఆచారాలను ఖచ్చితంగా పాటిస్తున్నామని చెప్పుకోవడానికి షియా ముల్లాలు ప్రయత్నిస్తున్నారు. (24-08-97వార్త)

13. ఇదేమి సంస్కృతి ?

ఉత్తర ప్రదేశ్‌లో హత్రాస్ జిల్లాలో దుండగుల అమానుషత్వానికి బలైన పందొమ్మిదేళ్ల దళిత యువతికి మరణానంతరం కూడా అగౌరవమూ, అవమానమూ తప్పలేదు. ఇందుకు సాక్షాత్తు రాజ్యమే కారణం కావడం ప్రజాస్వామ్య వ్యవస్థలో ఊహకందనిది. ఢిల్లీలోని సఫ్దర్‌జంగ్ ఆసుపత్రిలో పదిరోజులపాటు మృత్యువుతో పోరాడి మంగళవారం ఉదయం కన్నుమూసిన ఆ యువతి భౌతిక కాయాన్ని కుటుంబ సభ్యుల ప్రమేయం లేకుండా పోలీసులే అర్థరాత్రి ఆమె గ్రామానికి తరలించుకుపోవడం, కుటుంబ సభ్యులెవ్వరూ లేకుండా వారే అంత్యక్రియలు పూర్తిచేయడం ఎలాంటివారికైనా దిగ్భ్రాంతి కలిగిస్తుంది. వాహనానికి అడ్డొచ్చిన యువతి తల్లిదండ్రులనూ, ఆమె అన్నాచెల్లెళ్లను పక్కకు నెట్టి ఆ తర్వాత వారిని వారింట్లోనే బంధించి ఈ తతంగమంతా పూర్తిచేయడం దేశం మొత్తం సిగ్గుతో తలదించుకునే విషయం. ఆమె భౌతికకాయాన్ని అప్పగిస్తే ఇంటికి తీసుకెళతామని పోలీసుల కాళ్లావేళ్లాపడిన తీరు హృదయ విదారకమైనది. ఆ దృశ్యాలు చాన్నాళ్లవరకు అందరిని వెంటాడుతూనే ఉంటాయి. అసలు ఆ మృతదేహం పోలీసులు స్వాధీనం చేసుకున్న తీరే పెద్ద మిస్టరీగా ఉంది. తెల్లవారు జాము 4 గంటలకు ఆమె మరణించిందని తెలిసి, స్వగ్రామానికి తీసుకెళ్లడానికి కుటుంబం ఏర్పాట్లు చేసుకుని 6 గంటల సమయంలో అడిగేసరికి ఆసుపత్రి అధికారులు పోలీసులకు అప్పగించామని చెప్పారు. ఆ సమయం నుంచి అర్థరాత్రి వరకు ఆ యువతి భౌతిక కాయం ఎక్కడుంచారో తెలియదు.కనీసం స్వాధీనం చేసుకున్న వెంటనే ఆమె స్వస్థలానికి తరలించినా మధ్యాహ్నానికి అంత్యక్రియలు పూర్తయ్యేవి. ఈ మొత్తం వ్యవహారాన్ని అలహాబాద్ హైకోర్టు గురువారం సుమోటోగా తీసుకుని ఉన్నతాధికారులను తన ఎదుట హాజరుకావాలని ఆదేశించడం మంచి పరిణామం. ఆ మృతదేహానికి పోలీసులు నిర్వహించినవి ఏ ప్రమాణాలతో చూసినా అంత్యక్రియలు కాదు. మీడియా కథనాలను బట్టి పోలీసులు తమ వెంట తెచ్చిన ప్లాస్టిక్ డబ్బానుంచి ఒక ద్రవాన్ని చితిపై పోసి నిప్పుపెట్టారు.తాము నమ్మే హిందూ మత విశ్వాసాల ప్రకారం పవిత్ర జలాలను చితిపై జల్లి, అనంతరం దహనం చేయాలని...దానికి ముందు ఇంటికి తీసుకెళ్లాలని తల్లిదండ్రులు చెబుతున్నారు. పైగా అర్థరాత్రి శవదహనం చేయడం తమ ఆచారానికి విరుద్ధమని జిల్లా మెజిస్ట్రేట్ కాళ్లావేళ్లాపడ్డారు. తమ కుమార్తెను చివరి సారి చూసుకోలేకపోయామని చింతిస్తున్నారు. శాంతి భద్రతల పరిస్థితి తలెత్తకుండా చూసేందుకు ఈ నిర్ణయం తీసుకోవాల్సి వచ్చిందని పోలీసులు చెబుతున్న కారణం చెల్లదు. అలాంటి సమస్య తలెత్తుతుందనుకుంటే అందుకు అవసరమైన ఏర్పాట్లు చేసుకోవాల్సిన బాధ్యత వారిదే. అంతే తప్ప ఆ మాటున పౌరుల విశ్వాసాలను కాలరాసే హక్కు వారికి లేదు. హత్రాస్‌లో అమానుషంగా వ్యవహరించిన పోలీసులకు...జిల్లా ఉన్నతాధికారులకు ఉండకపోవచ్చుగాని, ఏమతస్తులకైనా చావు,పుట్టుకల సమయాల్లో

ఇల్లిన విధివిధానాలపై విశ్వాసాలుంటాయి. వాటిని నిర్వర్తించలేకపోవడాన్ని ప్రచారంగా భావిస్తారు. అది జీవితాంతం వారిని వెంటాడుతుంది. కశ్మీర్‌లో ఉగ్రవాదులు పోలీసుల చేతుల్లో మరణించిన సందర్భాల్లో ఈ విధానం అమలవుతుందోని, చెబుతున్నారు. కానీ ఈ ఉదంతంలో మరణించినామె ఒక సాధారణ దళిత కుటుంబానికి చెందిన యువతి.

అసలు అత్యాచారం జరిగిందని ఫిర్యాదు వచ్చిన వెంటనే పోలీసులు వ్యవహరించిన తీరు అక్కడి యోగి ఆదిత్యనాద్ ప్రభుత్వానికిగాని, పోలీసు విభాగానికిగాని ప్రతిష్ట తెచ్చేదికాదు. గత నెల 14న ఫిర్యాదు వస్తే ఎంతో జాప్యం తర్వాత ఎఫ్ఐఆర్ నమోదయింది. తొలుత అత్యాచారం ఆరోపణ చేర్చడానికి పోలీసులు సిద్ధపడలేదు. ఆ యువతికి చెందిన వాల్మీకి కులస్తులు ఒత్తిడి చేశాకే ఆపని చేశారు. ఇప్పుడు ఆమె భౌతిక కాయానికి అంత్యక్రియలు కూడా అయ్యాక అత్యాచారం జరగలేదని, తీవ్ర గాయాలు కూడా లేవని పోలీసులు మాట్లాడుతున్న తీరు దిగ్భ్రాంతి కలిగిస్తుంది. ఫోరెన్సిక్ నివేదికను అందుకు సాక్ష్యంగా చూపుతున్నారు. యువతి చావుబతుకుల్లో ఉండగా ఇచ్చిన వాంగ్మూలంలో తనపై నలుగురు యువకులు అత్యాచారం చేశారని చెప్పింది.మరణ వాంగ్మూలాన్ని మన చట్టాలు నూరుశాతం నమ్ముతాయి. ఆఖరి ఘడియల్లో ఉన్నవారు అబద్ధం చెప్పరన్నది దానికి ప్రాతిపదిక. పైగా యువతి మర్మావయవంపై తీవ్రగాయాలున్నాయని తొలుత పరీక్షించిన లేడి డాక్టర్ నిర్ధారించారు. అత్యాచారం జరిగిందో లేదో తేల్చాల్సింది ఫోరెన్సిక్ నిపుణులే. అయితే నిర్భయ చట్టం ప్రకారం అత్యాచారానికి సంబంధిచిన ఇతరత్రా సాక్ష్యం లభ్యంకానప్పుడు మర్మాయవంపై గాయం ఆధారంగా అత్యాచారం జరిగిందని భావించవచ్చు. అంటే దుండగులపై అత్యాచారం కేసు పెట్టడానికి లేడీ డాక్టరు ఇచ్చిన నివేదికే సరిపోతుంది. ఇప్పుడు జరుగుతున్నది గమనిస్తే యువతికి న్యాయం చేయడం కంటే ఆ దుండగులను కాపాడడానికే పోలీసులు ప్రాధాన్యమిస్తున్నట్టు కనబడుతోంది.

ఒకపక్క హథ్రాస్ ఉదంతాన్ని చల్లార్చడానికి పోలీసులు ప్రయత్నిస్తుండగానే, బలరాంపూర్ అనేచోట కాలేజీలో చేరడానికి ఇంటినుంచి వెళ్లిన 22 ఏళ్ల దళిత యువతి అత్యాచారానికి గురై శవమై ఇంటికి వచ్చింది. ఆమె ఒంటినిండా గాయాలున్నాయని, మీడియా కథనాలు చెబుతుండగా హథ్రాస్ మాదిరే ఇక్కడ కూడా పోలీసులు వేరే కథనం వినిపిస్తున్నారు. ఆమె ఒంటిపై గాయాలే లేవంటున్నారు. గత రెండు,మూడు నెలలుగా ఉత్తరప్రదేశ్‌లో జరుగుతున్న అత్యాచారాల పరంపరపై ఇప్పటి కైనా యోగి ప్రభుత్వం మేల్కొనాలి! అమానుష ఘటనలు జరిగినప్పుడు ఫిర్యాదు సమయంలోనే కప్పెట్టే ప్రయత్నాలు, అది సాధ్యం కాకపోతే అసలు అత్యాచారమే జరగలేదన్న దబాయింపులు పరిస్థితిని ఏమాత్రం మెరుగుపరచవు. అధికార యంత్రాంగాన్ని ప్రక్షాళన చేసి బాధితుల పట్ల సున్నితంగా వ్యవహరించే సంస్కృతిని పెంపొందిస్తే తప్ప అది సాధ్యం కాదు!.

(02-10-2020 సాక్షి సౌజన్యంతో)

14. ధరణికి దావానలం సెగ

ప్రపంచం వరుస విపత్తులతో తల్లడిల్లుతోంది. నిత్యం ఎక్కడో ఒకచోట కార్చిచ్చులో, వరదలో, క్షామమో ప్రజలను బాధిస్తున్నాయి. దావానాలవల్ల అమెరికా పశ్చిమ తీరంలోని 12 రాష్ట్రాల్లో కనీవినీ ఎరగని స్థాయిలో మంటలు చెలరేగుతున్నాయి. ఆకాశం నారింజ రంగు సంతరించుకుంది. ఆమంటల నుంచి ఎగసిన పొగ 10 కిలోమీటర్ల ఎత్తుకి విస్తరించడమే కాకుండా,అమెరికా తూర్పు తీర రాష్ట్రాల వరకూ చేరి వాయుకాలుష్యాన్ని పెంచింది. ఇప్పటిదాకా అమెరికాలో కాలిపోయిన ప్రాంత విస్తీర్ణం 69 లక్షల ఎకరాలు. అందులో కాలిఫోర్నియాలో దహనమైనది 33లక్షల ఎకరాలు. ఉత్తర ధృవప్రాంతంలో అలాస్కా, సైబీరియాలనుంచి దక్షిణంలో ఆస్ట్రేలియా, తూర్పున ఆసియా నుంచి పడమర అమెరికా పసిఫిక్ తీరం వరకూ ఏడాదిగా ఎక్కడో ఒకచోట అడవులు మండుతూనే ఉన్నాయి.

అన్ని దేశాలకూ ముప్పు : భారత్‌లో 21.4 శాతం అడవులు కార్చిచ్చు ప్రభావ ప్రాంతాలుగా గుర్తించారు. గత ఏడాది మన అడవుల్లో 29,547 మంటలను నమోదు చేశారు. ఈ ఏడాది మే నెలలో ఉత్తరాఖండ్ రాష్ట్రంలోని అడవుల్లో మంటలు చెలరేగాయి. సెప్టెంబరు ఒకటిన అఫ్ఘనిస్థాన్‌లో వరదలు 190 ప్రాణాల్ని బలిగొన్నాయి. నేపాల్, చాడ్, సెనెగల్, సూడాన్, నైజీరియా, కెన్యా, బుర్కినాఫాసో, ఘనా, పాకిస్తాన్,కామెరూన్, అల్జీరియా, ట్యునీషియా, వియత్నాం, ఉగాండా దేశాలను సెప్టెంబరులో వరదలు ముంచెత్తాయి. మన దేశంలో ఆగస్టులో 11 రాష్ట్రాలో 868 మంది వరదలకు బలవ్వగా, అయిదో వంతు దేశం క్షామం బారిన పడింది. మూడో వంతు అమెరికాలో క్షామం తాండవిస్తోంది. 5కోట్ల30లక్షల మందిని క్షయ(టీబీ) పీడితులుగా గుర్తించారు. ఏదో ఒక విపత్తుకి గురికాని దేశం భూమండలంపైనే లేదు.

ఈ ఏడాది కోవిడ్ మహమ్మారి జనజీవనాన్ని స్తంభింపజేసినా మండుతున్నఅడవులూ, పీట్‌లాండ్స్ కారణంగా కర్బన ఉద్గారాలు 4 నుంచి 7 శాతం మాత్రమే తగ్గవచ్చని అంచనా. 2030 నాటికి కర్బన ఉద్గారాలు 2010తో పోలిస్తే 45 శాతం తగ్గాలని భూతాపం నివేదిక పేర్కొన్నా...ఆదిశగా అడుగే పడడంలేదు. ప్రభుత్వాలూ, ప్రజలూ, మాధ్యమాలూ ఈ సమస్యను గుర్తించడమే లేదు. మనదేశంలో 2019 ఎన్నికల ప్రణాళికల్లో ఏ పార్టీ ఈ అంశాన్ని ప్రస్తావించలేదు. ప్రపంచ వాతావరణ సంస్థ ఇతర ఆరు ప్రముఖ సైన్సు సంస్థలతో కలిసి 2020 సెప్టెంబరులో విడుదల చేసిన నివేదిక 2024 లోపు ఒక ఏడాదిలో భూ ఉపరితల ఉష్ణోగ్రత పెరుగుదల 1.5 డిగ్రీల సెల్సియస్ పరిమితిని తాత్కాలికంగా దాటుతుందని వెల్లడించింది. త్వరలోనే శాశ్వతంగా ఆ పరిమితిని దాటేసే అవకాశం పెరుగుతోందని తెలిపింది. ఈనెలలోనే వచ్చిన మరో నివేదిక 2050నాటికి

మంది వాతావరణ సంక్షోభం కారణంగా నిర్వాసితులవుతారని, ఇది ప్రపంచాన్ని కుదిపేస్తుందని స్పష్టంచేసింది. పసిఫిక్ మహాసముద్ర భూమధ్య ప్రాంతంలో సముద్ర ఉపరితల ఉష్ణోగ్రత సాధారణంకంటే కనీసం 0.5 డిగ్రీల సెల్సియస్ తక్కువ ఉన్నప్పుడు ఏర్పడే లా నినా ప్రభావం వల్లే ప్రస్తుత అమెరికా పసిఫిక్ తీరంలో దావానల తీవ్రతకు కారణం.

అతి వాతావరణ పరిస్థితులు: 'లా నినా' అనే స్పానిష్ పదానికి అర్థం ' చిన్న అమ్మాయి' కనీసం 0.5 డిగ్రీల సెల్సియస్ ఎక్కువగా ఉంటే ఏర్పడే స్థితిని 'ఎల్ నినో' (చిన్న అబ్బాయి) అంటారు.లా నినా వల్ల అమెరికా దక్షిణ, పశ్చిమ పసిఫిక్ తీరంలో పొడి, వేడి గాలులు వీస్తాయి. ఉత్తర పశ్చిమ పసిఫిక్ తీరంలో చల్లని తడిగాలులతో వానలు కురుస్తాయి. అలాగే తూర్పున అట్లాంటిక్ తీరంలో పెను తుపాన్లకు అనువైన భౌతిక స్థితి కలిపిస్తుంది. 'లా నినా' సహజ ప్రక్రియ. కాని దానికి వాతావరణ మార్పులు తోడైన సందర్భంలో కార్చిచ్చు. పెను తుఫానులు జంటగా వస్తాయని ప్రముఖ వాతావరణ శాస్త్రవేత్త మైఖేల్ మాన్ చెబుతున్నారు. భూతాపంతో పెరుగుతున్న ఉష్ణోగ్రతలకు లా నినా ప్రభావం తోడై అమెరికాలో దావానలం అప్రతిహతంగా విస్తరిస్తోంది కాలిఫోర్నియాలో మండే అడువుల వార్షిక విస్తృతి 1970 తో పోలిస్తే అయిదు రెట్లు పెరిగింది. వేసవిలో ఎనిమిది రెట్లు పెరిగింది.అధికమవుతున్న ఉష్ణోగ్రతలతో చెట్లు, గడ్డి ఎండిపోవడమే అందుకు కారణం. ఒకవక్క అమెరికా పశ్చిమ తీర రాష్ట్రాల్లో కార్చిచ్చు ప్రజ్వరిల్లుతుంటే, దానికి తూర్పున కొన్ని వందల మైళ్ల దూరంలోని కొలరాడో, వయోమింగ్ రాష్ట్రాల్లో సెప్టెంబరు ఏడో తేదీ మధ్యాహ్నం నుంచి 8 ఉదయానికి 18గంటల్లో ఉష్ణోగ్రత 33 డిగ్రీల సెల్సియస్ మేర తగ్గి- ఎండడుగుల మంచు కురిసింది. అదే సమయంలో అమెరికా తూర్పుతీరంలో అత్యధికంగా 25 హరికేన్లు వస్తాయని ఆ దేశ వాతావరణ శాఖ ముందస్తు సూచన చేసింది. ఇది అతి వాతావరణానికి ప్రతీక. వాతావరణ మార్పులతో అతి వాతావరణం కొత్త సాధారణ స్థితిగా అవతరిస్తోంది.ప్రస్తుతం నగటు భూమి ఉపరితల ఉష్ణోగ్రతలు 4 డిగ్రీల సెల్సియస్ మేర పెరిగేందుకు అనువైన పరిస్థితులు నెలకొన్నాయి. అదే జరిగితే శాస్త్రవేత్తల అధ్యయనాల ప్రకారం ఇప్పటి జనాభాలో 10 శాతం మాత్రమే మనుగడ సాగించే అవకాశం ఉంటుంది. ఊహించడానికే కష్టమైన ఇలాంటి పరిస్తితిని నిరోధించడానికి అందరూ ముందుకు కదలక తప్పదు. మానవ చర్యలతో ఏర్పడిన ఈ విపత్తును మానవులే తొలిగించాలి. అందుకు ఉమ్మడి కార్యచరణ అవసరం.

హెచ్చరికలు గాలికి......

గడిచిన పన్నెండు వేల సంవత్సరాలుగా మానవ నాగరిక పరిణామానికి దోహదపడిన వాతావరణం ఇప్పుడెందుకిలా మనిషి మనుగడకు ప్రమాదకరంగా మారింది? ఇదంతా ప్రకృతిపరంగా సహజమైనదికాదని, ఈమార్పుల వెనుక మానవ వేలి ముద్రలు, పాద ముద్రలు ఉన్నాయన్నది విజ్ఞాన శాస్త్రం విస్పష్టంగా చెబతున్న సత్యం! వందేళ్ల పూర్వమే అర్హీనియస్ పరిశోధనలు గాలిలో పెరిగే కర్బనంతో భూతాపం పెరుగుతుందని హెచ్చరించాయి. కానీ అర్థికవృద్ధి మోజులో

సైన్సును పెడచెవిన పెడుతూ వచ్చిన ప్రభుత్వాలూ, మానవ సమాజాలు సమస్యను పెంచాయి. 1988లో జేమ్స్ హాన్సెన్ భూతాపం పెరుగుతోందని వివరించినా, 1990లో మొదటి ఐ.పి.సి.సి. నివేదిక భూతాప ప్రమాదాన్ని ఖరారు చేసినా. ఐక్య రాజ్య సమితి ఆధ్వర్యంలో నిరోధక చర్యల కోసం అంతర్జాతీయ సదస్సులు ప్రారంభమైనా, గత 30 ఏళ్లలో గాలిలోకి వదిలిన కర్బనం, మొత్తం గాలిలోని కర్బనంలో 62 శాతం అంటే ప్రమాదాన్ని గుర్తించిన తరవాతనే అత్యధికంగా కర్బనాన్ని వెలువరించామన్నది స్పష్టమవుతోంది. గాలిలో హరిత గృహ వాయువుల మోతాదు పెంచి భూగ్రహ శక్తి సమతౌల్యాన్ని దెబ్బ తీశాం.2015 డిసెంబరులో నగటు భూ ఉపరితల ఉష్ణోగ్రత పెరుగుదలను 1.5-2డిగ్రీల సెల్సియస్ మధ్య పరిమితం చేయడానికి పారిస్ ఒప్పందానికి అంగీకరించిన దేశాలు అమలులో మాత్రం విఫలమయ్యాయి. ఏటా ఉద్గారాలు పెరుగుతూనే వచ్చాయి.

(పర్యావరణ రంగ నిపుణులు)ఈనాడు 29-09-2020 సౌజన్యంతో

---

15. మీకు తెలుసా?

అక్టోబరు 11ను అంతర్జాతీయ బాలికల దినోత్సవంగా - ఐక్యరాజ్య సమితి-2011లో ఓ తీర్మానం చేసి ప్రకటించింది. 2012 నుంచి ప్రతి యేటా బాలికల దినోత్సవాన్ని నిర్వహిస్తోంది! బాలికల హక్కుల పరిరక్షణ, పురోగతికి కృషి చేయాలని ఆదేశించింది.

1.15-18 ఏళ్లలోపు వున్న బాలికల్లో 40 శాతం మంది బడులకు కళాశాలలకు వెళ్లటం లేదు! వారిలో 65 శాతం మంది ఇంటిపనులతో సతమతమైపోతున్నారు.

2. ఆడపిల్లలపట్ల వివక్ష చూపని దేశాలు ఏవో తెలుసా? స్వీడన్, ఫిన్‌ల్యాండ్, నెదర్లాండ్స్, బెల్జియం దేశాలు మొదటి అయిదు స్థానాల్లో నిలబడ్డాయి. ఈ వరుసలో అమెరికా 32వ స్థానంలో ఉండగా, భారత్ - 59వ స్థానంలో ఉండటం గమనార్హం!

3. బాలికల పట్ల అమానుషంగా వున్న దేశాల్లో మాలి, చాద్, నైజర్, గినీ, సెంట్రల్‌ఆఫ్రికన్, రిపబ్లికన్ అగ్రస్థానాల్లో వున్నాయి! దాదాపుగా ఇవన్నీ ఆఫ్రికా దేశాలే!

4. బాల్య వివాహాలు ఈనాటికీ జరుగుతున్నాయంటే సిగ్గుచేటైన వ్యవహారమే! 2011 జనాభా లెక్కల ప్రకారం పదిహేనేళ్లకే బిడ్డ తల్లయిన అమ్మాయిలు 45 లక్షలమంది కాగా ఇద్దరు పిల్లలకు తల్లులైన వారు 75 శాతం మంది వున్నారంటే ఏమనుకోవాలి.

10. తీర్పులను ప్రశ్నిస్తే..కోర్టు ధిక్కారమా?

డిస్నీ మూవి జంగిల్ బుక్(1967) లో ఒక ఆసక్తికరమైన దృశ్యం ఉంది కా అనే పేరున్న ఒక కొండచిలువ అందులో ప్రధానపాత్ర అయిన మౌగ్లీని తియ్యని గొంతుతో వశీకరణకు గురి చేస్తుంది.

'నేను క్లిష్ట సమయాల్లో సాయం చేయని
నీ స్నేహితుల్లాంటి దాన్ని కాను
నీవు నన్ను నమ్మవచ్చు
నన్ను నమ్ము, నన్ను మాత్రమే నమ్ము
కళ్లు మూసుకో , నాపై నమ్మకం ఉంచు
నీచుట్టు నేను ఉన్నాననే ఎరుకతో...
ప్రశాంతంగా , గాఢంగా నిద్రపో

మౌగ్లీ ప్రత్యర్థి పక్షంలో ఉండే కా ది ఒక సంక్లిష్టపాత్ర, ఒక ఆరేళ్ల బాలిక కళ్లు విప్పార్చి ఈ ప్రామాణిక కార్టూన్ మూవీని చూస్తున్నప్పుడు పై పాటలో చెప్పినదానికి భిన్నంగా ఆ కొండచిలువను నమ్మకూడదని స్పష్టంగా అనిపిస్తుంది. అందునా ప్రశ్నించడానికి వీలులేని విశ్వాసాన్ని కలిగిఉండాలని చెప్పే జీవిని అసలు నమ్మకూడదనే సహజానుభూతి ఆ సినిమా చూస్తున్నంత వరకు మీకు కలుగుతూ ఉంటుంది. మన ప్రజాస్వామిక వ్యవస్థలోని అత్యంత శక్తివంతమైన విభాగం అదే రీతిలో మనల్ని కోరుతుంది. పైగా చట్టంగా దానికి పవిత్రతను కల్పించి కోర్టు వ్యవహారాల నేర ధిక్కరణగా పేర్కొంటూ ఆయుధంగా మలిచింది. దాన్ని ఇష్టానుసారం వినియోగిస్తున్న చరిత్ర ఉన్నా కోర్టు ధిక్కరణ భావన నిలకడగా కొనసాగుతూనే ఉంది. ఇది న్యాయస్థానాన్ని పరిరక్షించుకునేందుకుగానీ, న్యాయమూర్తుల ప్రతిష్టను దెబ్బతీసే , దూషించే వ్యాఖ్యలనుంచి రక్షించుకునేందుకుగాని ఉద్దేశించిన చట్టంకాదని సుప్రీంకోర్టు పదేపదే చెబుతూ వస్తోంది. అది కేవలం న్యాయవ్యవస్థ నిజాయితీగా, నిష్పక్షపాతంగా ఉంటుందని...దాని ద్వారా తమకు న్యాయం లభిస్తుందని పరంపరగా ప్రజల్లో ఉండే విశ్వాసానికి విఘాతం కలగకుండా చూసేందుకు మాత్రమేనని నొక్కి చెబుతూ వచ్చింది.

అయితే ప్రముఖ న్యాయవాది ప్రశాంత్ భూషణ్‌ని కోర్టు ధిక్కార చట్టంకింద దోషిగా ప్రకటించిన నేపథ్యంలో సుప్రీంకోర్టు నిర్ణయం పట్ల ఆగ్రహం, ఖండనలు సహజంగానే వెలువడ్డాయి. కోర్టు ధిక్కారం ఎంత వక్రీకరణకు గురవుతుందో వాక్ స్వేచ్ఛ, భావ వ్యక్తీకరణకు సంబంధించి మనకున్న ప్రాథమికహక్కు అది ఎంత భంగకరంగా మారిందో చెప్పడానికి దీనికి మించిన ఉదాహరణ మరొకటి ఉండదు. సుప్రీంకోర్టు పెంచిపోషించిన కోర్టు ధిక్కారం అనే భావన మొత్తం న్యాయవ్యవస్థపై ప్రజల నమ్మకాన్నే దెబ్బతీస్తోంది. కోర్టు ధిక్కరణ చర్యలు చేపట్టడం ద్వారా న్యాయవ్యవస్థపై ప్రజా విశ్వాసం దెబ్బతినేలా చేయడం సమంజసమేనా? స్వయంగా సుప్రీంకోర్టు 1995లో ఒక తీర్పు సందర్భంగా ఇదే విషయమై హెచ్చరించిందని మర్చిపోరాదు.ఈ 21వ శతాబ్ది ప్రజాస్వామ్యంలో ఏ న్యాయవ్యవస్థ

అయినా సరే తనపై పౌరుల నమ్మకమే అంతరించిపోయేలా ఇలాంటి అస్పష్టమైన నిరంకుశ దృక్పథాలను కలిగి ఉండడమే పెద్ద అసంగతమైన విషయం. తన మౌలిక పునాదుల్లో ప్రజా విశ్వాసానికి అగ్రస్థానం ఇస్తున్నట్లు న్యాయవ్యవస్థ చెప్పుచున్నప్పటికి ఇప్పుడు జరుగుతున్నది జవాబుదారీతనం లేని పారదర్శకతలేని, ప్రజాప్రాతినిధ్యం ఏమాత్రం లేని తరహాలో న్యాయవ్యవస్థ పనితీరు కొనసాగడమే. న్యాయవ్యవస్థను పీడిస్తున్న రెండు ప్రధాన సంస్థాగత అంశాలను చర్చించడం ద్వారా దానిపై ప్రజలకు ఉన్న విశ్వాసాన్ని ఎట్టి పరిస్థితుల్లోనూ పరిరక్షించాలని ప్రకటిస్తున్న కోర్టు ధిక్కార చట్టానికి సంబంధించిన తాత్విక పునాదే ఇప్పుడు సమస్యాత్మకంగా ఎలా మారిపోయిందన్న విషయాన్ని ఇక్కడ ఎత్తి చూపడానికి ఈ కథనం ప్రయత్నిస్తోంది. మొదటిది సమగ్ర డాక్యుమెంటేషన్, న్యాయవిచారణ క్రమాలను నిక్షిప్తం చేయడం అనే ప్రాథమిక ప్రక్రియలోని న్యాయవ్యవస్థ లా విఫలమవుతుందని అంశాన్ని ఈ కథనం శోధిస్తుంది. ఇలాంటి రికార్డులు ఉనికిలో లేకపోవడం వల్ల న్యాయవస్థ తప్పులకు జవాబుదారీతనం లేకపోవడం, వెనుకబడిన ప్రజానీకానికి న్యాయం జరగకుండా పోవడంతో సులభంగా జరిగిపోతోంది. రెండు జవాబుదారీతనం నుంచి న్యాయ కార్యాలయాలు వేరు పడిపోతున్నాయనే అంశాన్ని ఈ కథనం పరిశీలిస్తుంది.

కోర్టు రికార్డులు:

ప్రశాంత్ భూషణ్ కోర్టు ధిక్కార విచారణ ద్వారా వెలుగులోకి వచ్చిన న్యాయవ్యవస్థకు సంబంధించిన బాధాకరమైన వాస్తవాల్లో ఒకటి ఏదంటే, కోర్టు విచారణలకు సంబంధించిన సమగ్రమైన రాత ప్రతులు, రికార్డులు లేకపోవడం, భారత రాజ్యాంగం ప్రకారం కోర్టు రికార్డులు అనే ప్రాతిపదికనే సుప్రీంకోర్టులో కానీ, హైకోర్టులో కానీ కోర్టుధిక్కార చర్యలకు గాని శిక్షించే అధికారాన్ని కలిగి ఉన్నాయి. కోర్టు రికార్డులు అంటే సాక్ష్యాలను డాక్యుమెంట్ రూపంలో భద్రపరచే న్యాయచర్యలు,ప్రక్రియలు. ఈ రికార్డులే న్యాయస్థానాల ముందు విచారణ ప్రక్రియలకు సాధికారిక పత్రాలవుతాయి. కోర్టు రికార్డులు అని చెబుతున్నవి వాటి నిజమైన అర్థంలో కోర్టులకు అందుబాటులో ఉండడంలేదని ప్రశాంత్‌భూషణ్ కేసులో సాగిన న్యాయప్రక్రియ సాక్ష్యాధారమై నిలిచింది. భూషణ్ కౌన్సిల్ సీనియర్ అడ్వకేట్ దుష్యంత్ దావే మౌఖికంగా చెప్పిన అనేక అంశాలకు న్యాయమూర్తులు ఇచ్చిన తీర్పుల్లో కానీ ఆదేశాల్లో కానీ చోటు లేకుండాపోయింది. ఇది న్యాయస్థానాన్ని బాగా ఇబ్బందిపెట్టింది. కోర్టు విచారణలను (ఆడియో రికార్డింగ్, లైవ్ ట్రాన్స్క్రిప్షన్)సమగ్రంగా డాక్యుమెట్ చేయగలిగిన సాంకేతిక సాధనాలు దశాబ్దాలుగా అందుబాటులో ఉంటున్నప్పటికి ఈ విషయంలో న్యాయవ్యవస్థ వైఫల్యం కనబడు తోంది. ఇతర దేశాల న్యాయవ్యవస్థలతో పోలిస్తే భారత న్యాయవ్యవస్థ డాక్యు మెంటేషన్‌కి సంబంధించి సమర్థ వ్యవస్థలను చేపట్టడంలో నిర్లక్ష్యం ప్రదర్శిస్తోంది.

దీనికి సంబంధించి మీడియా పాత్రను ప్రశంసించడానికి బదులుగా న్యాయస్థానాల్లో మీడియా ఉనికినే కోర్టు వ్యతిరేకిస్తోందన్నది వాస్తవం. లాక్‌డౌన్ కాలంలో మీడియాకు ఆన్‌లైన్ విచారణలను అందించే ఏర్పాట్లు కల్పించడంలో

సుప్రీంకోర్టు విఫలమైంది. సుప్రీంకోర్టు ఆవరణలోని మీడియా రూమ్‌ల నుంచి న్యాయవిచారణను పరిశీలించడానికే జర్నలిస్టులను పరిమితం చేశారు.మీడియా పదేపదే అభ్యర్థించినప్పటికీ న్యాయ విచారణలను ప్రత్యక్ష ప్రసారం చేయడానికి తగిన లింకులను కోర్టు అందించలేదు. పైగా జర్నలిస్టులకు కోర్టు నుంచి అనుకోని విమర్శలు ఎదురయ్యాయి. 2020 ఆగస్టు 25న జరిగిన ఒక విచారణ సందర్భంగా జస్టిస్ అరుణ్‌మిశ్రా లీగల్ న్యూస్ పోర్టల్స్‌లో ఏకపక్ష రిపోర్టింగ్ గురించి తన అసంతృప్తిని వ్యక్తంచేశారు. కానీ అలాంటి రిపోర్టింగ్ గురించి నిర్దిష్ట ఉదంతాలను ఆయన పేర్కొనలేదు. ప్రశాంత్‌భూషణ్ ఉదంతం కానీ, లాక్‌డౌన్ కాలంలో జర్నలిస్టులకు న్యాయవిచారణ ప్రక్రియను వినే అవకాశంపై ఆంక్షలు విధించడం అనేవి మన న్యాయవ్యవస్థలో అసాధారణంగా జరుగుతున్న ఘటనలు కావు. మీడియా పదేపదే అభ్యర్థిస్తు వస్తున్నప్పటికి తన కార్యాలయ ఆవరణలోకి సూర్యకాంతి చొరబడడానికి కూడా అనుమతించని రీతిలో భారతీయ న్యాయవ్యవస్థ స్పష్టంగా వ్యతిరేకతను ప్రదర్శిస్తూ వచ్చింది. సమగ్ర కోర్టు రికార్డులు లేకపోవడం తీవ్ర పర్యవసానాలకు దారితీస్తోంది. తక్షణ ప్రాతిపదికన చూస్తే కోర్టు తీర్పులను ఉద్దేశపూర్వకంగా అవాంఛనీయంగా తొలిగిస్తున్నారు. మౌఖికంగా చెప్పిన వాటిని అనిర్దిష్టంగా రికార్డు చేస్తున్నారు. కోర్టు గదిలో చేసిన ప్రకటనలను యధాతథంగా సంగ్రహించడంలో తీర్పులు విఫలమవుతున్నాయి. ఆడియో రికార్డింగ్‌కు తావు లేకపోవడం వల్ల న్యాయమూర్తులు చేస్తున్న అసందర్భ వ్యాఖ్యలు వారిని శిక్షకు దూరం చేస్తున్నాయి. న్యాయ విచారణ ప్రక్రియను సరైన విధంగా రికార్డు చేసి పదిలపర్చనందునే ధర్మాసనాలు పాక్షికత, వివక్షను ప్రదర్శించడానికి కారణం అవుతున్నాయి.

న్యాయస్థానమే సుప్రీమ్: ఉన్నత న్యాయమూర్తుల నియామకాన్ని 1993 నుంచి సుప్రీంకోర్టు నెలకొల్పిన కొలీజియం ద్వారా నిర్వహిస్తున్నారు. న్యాయమూర్తుల నియామకం విషయంలో ప్రభుత్వ నియంత్రణ తప్పించడానికి ఇలా ఏర్పాటు చేసుకున్నారు. అయితే జడ్జీల నియామక ప్రక్రియ విషయంలో కూడా తనిఖీ జరగడంలేదని గుర్తించాలి. హైకోర్టు, సుప్రీంకోర్టు న్యాయమూర్తుల నియామకం, బదిలీలకు సంబంధించిన వివరాలను చారిత్రకంగానే ప్రజలకు తెలీకుండా చేస్తున్నారు. జడ్జీల నియామకం, బదిలీలపై న్యాయ సమీక్షకు కూడా తావు లేకుండాపోయింది. హైకోర్టులకు న్యాయమూర్తులను, ప్రధాన న్యాయమూర్తులను నియమించడంలో బంధుప్రీతికి సంబంధించిన అనుమానాలు కొన్ని సందర్భాల్లో బహిర్గతమైనప్పటికి వాటిపై కనీస విచారణ జరిపించే సిస్టమ్‌కూడా మన న్యాయవ్యవస్థలో లేదు. 45 సంవత్సరాలకు పైబడిన వారినే హైకోర్టు న్యాయ మూర్తులుగా నియమించాలన్న నిబంధనను అతిక్రమించి ఇటీవలే కొన్ని నియామకాలు జరగడం తెలిసిందే. వయోపరిమితిని ఎందుకు సడలించాల్సి వచ్చిందో కొలీజియం తీర్మానించినా ఈ అతిక్రమణ ప్రాతిపదికన ప్రజలకు బహిర్గతం చేయలేదు.

అన్నింటికంటే మించి హైకోర్టులలో, సుప్రీంకోర్టులో న్యాయమూర్తుల

దుష్ప్రవర్తనకు సంబంధించిన చట్టాలు కూడా ఉన్నత న్యాయవ్యవస్థను న్యాయ ప్రక్రియనుంచే వేరు చేస్తున్నాయి. జడ్జీల దుష్ప్రవర్తన ఉదంతాలపై స్వతంత్ర దర్యాప్తు అథారిటీ లేదు. హైకోర్టులు, సుప్రీంకోర్టు న్యాయమూర్తులపై ఫిర్యాదులగు ఇన్ హౌస్‌లోనే పరిశీలిస్తామంటూ 1997లోనే ఉన్నత న్యాయస్థానం ప్రకటించింది. స్వతంత్ర ఎజెన్సీ ద్వారా కాకుండా న్యాయమూర్తులే ఈ ఫిర్యాదులపై విచారణ చేస్తే న్యాయవ్యవస్థ స్వతంత్రను కాపాడినట్టవుతుందని సుప్రీంకోర్టుఆనాడే వ్యాఖ్యానించింది. ఒకవేళ న్యాయమూర్తి తప్పు చేశారని తెలినా పార్లమెంట్‌లో అభిశంసన ద్వారా మాత్రమే తనను తొలిగించే అవకాశం ఉంది. రాజ్యాంగ న్యాయస్థానంలోని జడ్జిని తొలిగించే ప్రక్రియను ఈ అభిశంసన యంత్రాంగం ఒక్కసారి కూడా ఇంత వరకు వినియోగించలేదు.

అనేక కారణాలవల్ల న్యాయవ్యవస్థపై అవిశ్వాసం పెరుగుతున్న నేపథ్యంలో ప్రజాస్వామ్యాన్ని పరిరక్షించాలంటే న్యాయమూర్తులకు అపరిమితాధికారాలను కట్టబెట్టుతున్న ప్రక్రియనుంచి న్యాయస్థానాలను తరలించాల్సి ఉంది. న్యాయ మూర్తులపై నిరంతర తనిఖీకి దర్యాప్తు చేసే వ్యవస్థ ఉనికిలోకి రావాలి. తమ చర్యలను ప్రశ్నించేవారిపై కోర్టుధిక్కారం మోపి శిక్షిస్తున్న న్యాయవ్యవస్థను దాని భూస్వామ్య అవశేషాలనుంచి బయటకు లాగాలి. ప్రజాప్రాతినిధ్యానికి అతి తక్కువ అవకాశం ఉంటున్న న్యాయవ్యవస్థకు ఉన్న తిరుగులేని అధికారమే దానిపై అనుమానాలకు దారితీస్తోంది.

తనపై దర్యాప్తుకు, తనిఖీకి అనుమతించే ప్రగతిశీల చర్యలను చేపట్టడం ద్వారా మాత్రమే న్యాయవ్యవస్థ ప్రజాస్వామ్యంలో కీలకపాత్ర పోషించగలదు. తాను సేవిస్తున్న ప్రజలకు జవాబుదారీగా ఉండడం ద్వారానే అది తన ఔన్నత్యాన్ని నిలుపుకోగలదు. తాను పవిత్రమైన పునాదులపై ఉన్నట్టుగా తనకుతానుగా భావిస్తున్న భ్రమలనుంచి భారత న్యాయవ్యవస్థ బయటకు రావలసిన సమయం ఆసన్నమైంది. ఈ నిజాన్ని చెప్పడం వల్ల మన ప్రజాస్వామ్యం అంతమైపోదు. కాకపోగా అది ప్రజాస్వామ్య పునాదులను బలంగా నిలపగలుగుతుంది. జేమ్ బ్యారీ చెప్పినట్టుగా ప్రపంచమంతా విశ్వాసం, నమ్మకంపైనే ఆధారపడి ఉంది. మన రాజ్యాంగం, ప్రజాస్వామ్యం, ప్రజల పరిరక్షణ కోసం ఇప్పుడున్న స్థానంనుంచి బలమైన పునాదులమీద నిలబడడాన్ని మన న్యాయవ్యవస్థ ఇప్పటికైనా గుర్తిస్తుందని ఆశిద్దాం.

వ్యాసకర్త బాంబే హైకోర్టు న్యాయవాది(ది వైర్ సౌజన్యంతో)01-10-2020 నాటి సాక్షి నుండి)

రచనలు, సూచనలు
క్రాంతికార్, బుద్ధభవన్, 11-1-88, లెనిన్‌నగర్, ఖమ్మం-507001,
సెల్: 6281712639
Email:rationalistkranthikar123@gmail.com.

17. న్యాయాన్నీ రాజ్యాంగాన్నీ లౌకికతనూ , చట్టాన్ని చట్టుబండలు చేసిన సుప్రీంకోర్టు తీర్పులు!

రామ జన్మ భూమి-బాబ్రీ మసీదు వివాద, హిందూ-ముస్లింల మధ్య దశాబ్దాల పర్యంతం.కొనసాగి 1992 డిసెంబరు 6న బాబ్రీ మసీదును ఘోరాతి ఘోరంగా కూల్చి వేయడంతో పరాకాష్ట స్థాయికి చేరుకుంది. సకల సంఘ పరివార్ హిందూత్వ ఫాశిస్టు శక్తులు ఏకమై, కర సేవ పేరుతో వేలాదిమందిని సమీకరించి,బాబ్రీ మసీదు ను ఆక్రమించి నేలకూల్చడం జరిగింది. హిందూత్వ సంఘ్ పరివార్ గణాలు , సంఘాలు, పార్టీలు మీసాలు మెలివేసి, విజయగర్వం చాటారు. తదనంతరం దేశవ్యాప్తంగా జరిగిన మత కల్లోల్లాల్లో రెండువేల మంది పౌరులు ప్రాణాలు కోల్పోయారు. రథ యాత్ర పేరుతో మత విద్వేషాలు రగిలించిన బాబ్రీమసీదు విధ్వంసానికి కారకు లైన అద్వానీ, కూల్చివేసిన రోజు తనజీవితంలో అత్యంత విషాదకరమైన రోజు అని మొసలికన్నీరు పెట్టడం వారికే తగును.'కూల్చివేత దురదృష్టకర ఘటన" అని బాజ్‌పాయ్ బావురుమన్నాడు.

మసీదు విధ్వంసంపై రెండు కేసులు నమోదుచేశారు. (1) బాబ్రీమసీదు ఉన్న 2.77 ఎకరాల భూమి ఎవరిది? (2)కూల్చివేతపై కరసేవకులపైన అద్వానీ, సంఘ్ పరివార్ నాయకులు 49మందిపై పెట్టిన కుట్రకేసు దశాబ్దాలు గడిచిన తర్వాత గత ఏడాది 2019 నవంబరులో అయిదుగురు న్యాయమూర్తుల ధర్మా సనం తన తీర్పును వెలువరించింది.కొన్ని శతాబ్దాలుగా ఉన్న బాబ్రీ మసీదుకు చెందిన 2.77ఎకరాల స్థలాన్ని రామ మందిర నిర్మాణానికి అప్పగించింది. మసీదు నిర్మాణం కోసం వేరే చోట అయిదు ఎకరాల భూమిని సున్నీ వక్ఫ్ బోర్డుకు కేటాయించాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను ఆదేశించింది. హిందుత్వ అనుకూల తీర్పుతో పండుగ చేసుకున్న హిందుత్వశక్తులు రామాలయ నిర్మాణానికి ఏర్పాట్లుచేసుకోవడం మొదలుపెట్టారు.

ఒక లౌకిక దేశ ప్రదాని నరేంద్రమోడీ అయోధ్యలో రామాలయ నిర్మాణానికి శంకుస్థాపన చేయవచ్చా? భూమి పూజలో పాల్గొనవచ్చా? అనేది వివాదాస్పద మైంది. చర్చనీయాంశమైంది. ఒక రాజకీయ నాయకుని వ్యక్తిగత అభిప్రాయాలు, విశ్వాసాలు ఏవైనా కలిగి ఉండవచ్చు. కానీ ఒక లౌకిక రాజ్యాంగానికి బద్ధులైన మంత్రులు, పార్లమెంట్, శాసనసభ్యులు ప్రభుత్వ పదవిలో ఉన్నంతకాలం రాజ్యాం గాన్ని తు.చ. తప్పకుండా పాటించాలి! లౌకిక ప్రభుత్వ అధ్యక్షుడు, ప్రధాని, మంత్రులు, ముఖ్యమంత్రులు పదవుల్లో కొనసాగినంత కాలం రాజ్యాంగం యొక్క మౌలిక సూత్రాలను అవశ్యంగా పాటించాలి! ఏ మతానికి చెందిన పూజా కార్యక్రమాల్లోనైనా ప్రధానిగా, మంత్రిగా, పార్లమెంట్, శాసనసభ్యునిగా పాల్గొనరాదు. అలా పాల్గొనడం ప్రభుత్వ లౌకిక విధానానికి వ్యతిరేకం. అది రాజ్యాంగ విరుద్ధం! మోడీ ప్రభుత్వం ఒక మత సంస్థ జరిపే పూజలో ప్రధానిగా పాల్గొనడం లౌకిక రాజ్యాంగాన్ని ఉ ల్లంఘించడమే. లౌకిక రాజ్యాంగ సూత్రాలను ఉల్లంఘించిన వారెవరైనా ,

మహోన్నత పదవిలో ఉన్నా లౌకిక రాజ్యాంగ ఉల్లంఘనకు తగిన శిక్షకు గురికావాల్సిందే.

అలాగే బాబ్రీమసీదు కూల్చివేత కుట్రకేసులోని 32మంది ముద్దాయిలు అందరూ నిర్దోషులేనని సీబీఐ ప్రత్యేకకోర్టు తీర్పునిచ్చింది. సీబీఐ సమర్పించిన సాక్ష్యాధారాలు నిందితులను శిక్షించడానికి సరిపోవని కోర్టు తేల్చిచెప్పింది. అయితే ఈ ఉదంతంలో కుట్ర దాగి ఉన్నదని అప్పటి పి.వి. నర్సింహారావు ప్రభుత్వం లిబర్హాన్ కమిషన్ స్పష్టం చేసినప్పటికి సుప్రీంకోర్టు ధర్మాసనం పరిగణలోకి తీసుకోలేదు. ఆనాడు మీడియా ప్రతినిదిగా దగ్గరుండి చూసిన ప్రత్యక్ష సాక్షి రాధికా రామశేషన్ ఇచ్చిన సాక్ష్యాధారాన్ని ధర్మాసనం పరిగణలోకి తీసుకోలేదు. మసీదును కూల్చి వేయడానికి అవసరమైన ఉపకరణాలు కరసేవకుల చేతుల్లోఉన్నాయని ఉమా భారతితో సహాయ నాయకులు కరసేవకులను రెచ్చగొట్టడం, పని పూర్తయ్యే వరకు కదలొద్దని వారిని నాయకులు ఆదేశించారని ఆమె స్పష్టంగా చెప్పినప్పటికి కోర్టు పరిగణలోకి తీసుకోలేదు.
రాజకీయ-మత పాశిస్టులకు అనుకూలంగా ఇచ్చిన పక్షపాత తీర్పులు తప్ప వేరు కావు.

---

18. 'హిందూ' 'హిందుమతం' హిందూ దేశం' పదాలు ఎక్కడినుంచి వచ్చాయి?

ఈనాడు రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ (ఆర్ఎస్ఎస్) భారతీయ జనతాపార్టీ (భా.జ.పా) భజరంగ్‌దళ్, విశ్వహిందుపరిషత్ వగైరా హిందుత్వ సంస్థలు తాము హిందువులమని, తమ మతం హిందూమతమని, తమ దేశం హిందూ దేశమని గర్వంగా, ఘనంగా చాటి చెప్పుకోవడం ఆనవాయితీగా మారింది. అంబేడ్కర్ రాసిన పార్లమెంట్ ఆమోదించిన భారత రాజ్యాంగంలో అవి ఉన్నాయా? వారు పరమ పవిత్రంగా భావించుకునే చతుర్వేదాల్లో గానీ, వేదాంగాల్లో గానీ, వేదాంతాలు, స్మృతుల్లోకానీ, ధర్మశాస్త్రాల్లోకానీ, రామాయణం, మహాభారతం వగైరా ఇతిహాసాల్లో కానీ, పందలాది (పుక్కిటి) పురాణాల్లోకాని 'హిందూ' 'హిందూమతం/ధర్మం' అనే పదాలున్నాయా? ఆరు వైదిక మతాలుగా , షణ్మతాలలో, శైవ, వైష్ణవ, శాక్తేయ గాణపత్య, కౌమార, సౌర్య మతాలనే పరిగణించడం జరిగింది.
ఈ షణ్మతాల్లో హిందూమత ప్రసక్తి కలికానికైనా కానరాదు.
భరత వర్షాన్నికున్న పూర్వనామం'అజనాభం అని చెబుతారే కానీ 'హిందూ' పదం ఎక్కడా కానరాదనేది చారిత్రక వాస్తవం! అంతేకాదు భారతీయ తత్వశాస్త్రం హిందూ తత్వశాస్త్రం కాదు!

అసలు వాస్తవమేమిటంటే-ఎనిమిదవ శతాబ్దంలో భారత్‌కు అంటే సింధూ నది పరివాహక ప్రాంతానికి వలస వచ్చిన అరబ్బులు 'స' అనే అక్షరాన్ని పలకలేక సింధూ నదిని హిందూ నదిగా పిలిచేవారు. దానినే 'హిందూ' దేశం అని, స్థానికుల మతాన్ని 'హిందూమతంగా/హిందువులుగా పిలిచేవారు. అరబ్బులు, క్రమేణా అక్రమించుకున్న భూభాగాన్ని హిందూ దేశంగా పిలిచేవారు. ప్రాచీన

మేధావులు/పండితులు ఎవరూ తాము హిందువులమని చెప్పుకోలేదు. కాకపోగా 16వ శతాబ్దంనాటి క్రైస్తవ మిషనరీలే హిందూమతం అనే పదాన్నివాడటం మొదలెట్టారు.

అంతేకాదు-భారత్‌లో ముస్లింల పాలన-ఆంగ్లేయుల పాలనలాగా పూర్తిగా విదేశీయుల పాలన కాదు. ఒక్క బాబరు చక్రవర్తి లాంటి వారు కొద్దిమంది అరబ్ దేశాల నుంచి వచ్చారేమో కానీ వారి సంతతి -జహంగీర్, అక్బరు, షాజహాన్, ఔరంగజేబులాంటి వారు ఈ దేశంలోనే పుట్టారు. పైగా చక్రవర్తులేగాక ముస్లిం సైన్యాధికారులు ఇక్కడి హిందూ స్త్రీలను పెళ్లాడిన వారికి పుట్టిన సంతానం ఈదేశపు పౌరులే అవుతారు. ఈదేశంలో ఇస్లాం వ్యాప్తి చెందడానికి ముస్లిం చక్రవర్తుల సైన్యాలు, దాడులు కావనీ, ముస్లిం సూఫీ సన్యాసులు తమ వైద్య అనుభవంతో ప్రజల రోగాలను నయం చేసి మన్ననలు పొందేవారు. సూఫీ సన్యాసుల భక్తి, సేవాదృక్పథం ప్రబావంతో చాలామంది ఇస్లాంలో చేరి ముస్లింలుగా మారారు.

---

19. ఆధునిక భానిసత్వంలో 'స్త్రీ'

ఇటీవల జరుగుతున్న కొన్ని సంఘటనలు, పరిణామాలు చూస్తుంటే అసలు మనం ఏయుగంలో ఉన్నామా? అనే సందేహం , డైలమా మనస్సును తొలిచి వేస్తుంది లింగ వివక్షత, లైంగికదాడులు,అ(హ)త్యాచారాలు నిత్యకృత్యమౌతున్నాయి. మన దేశంలో రోజుకు సుమారు 90 అత్యాచార కేసులు పోలీసుస్టేషన్లలో నమోదవుతున్నాయని ఒక అధ్యయనం తెలుపుతోంది. నమోదుకానీ, వెల్లడికానీ స్త్రీలపై అక్రమాలు ఎన్నో...

ఒక వేళ అట్టి కేసులను నమోదు చేసినా, తమ రాజకీయ బాసుల ఆదేశాలతో పోలీసులు సదరు కేసులను నీరుగార్చే ఎత్తుగడల మూలంగా ఏనేరం చేసినా తప్పించుకోగలమన్న ధీమా- అడ్డూ అదుపులేని అఘాయిత్యాలకు నేరగాళ్లను పురిగొల్పుతోంది. అనేక చట్టాలున్నా, వాటి అమలు లేక, చట్టబద్ధ పాలన నోచుకోక, చట్టు బండలై మహిళల స్థితి గతులు అభద్రతా వాతావరణంలో కొట్టుమిట్టాడుతున్నాయని, ఏడేళ్ల క్రితమే జస్టిస్ జే.ఎస్.వర్మ కమిటీ కుండబద్దలు కొట్టినట్టు చెప్పింది.

స్త్రీలపై లైంగిక దాడుల కేసుల్లో తక్షణమే ఎఫ్ఐఆర్ నమోదు చేయాలని సీఆర్‌పీసీ 173వ సెక్షన్ ప్రకారం దర్యాప్తును కచ్చితంగా 60 రోజుల్లో పూర్తి చేయాలనే నిబంధనలున్నప్పటికి, నేర విచారణ స్మృతిలోని 154వ సెక్షన్ ప్రకారం ఎఫ్ఐఆర్‌ను తక్షణమే నమోదుచేయాలని, 173 వ సెక్షన్ ప్రకారం దర్యాప్తును కచ్చితంగా 60 రోజులులోనే పూర్తిచేయాలని 2013లో తీర్పు ఇచ్చిన సుప్రీంకోర్టు పోలీసు యంత్రాంగానికి మార్గదర్శకంగా ఎనిమిది ఆదేశాలు జారీచేసినప్పటికీ లైంగిక అ(హ)త్యాచారాలు నానాటికి పెరుగుతుండడం కటికవాస్తవం.

వళ్లు గగురుపొడిచే ఇలాంటి ఏహ్యాతి ఏహ్యమైన నేరాల్లో నిందితులకు

శిక్ష పడకపోతే దర్యాప్తు, విచారణ పోలీసు అధికారులను జవాబుదారి చేసి, శాఖాపరంగా వాళ్లను శిక్షించాల్సిందేనని 2014లో న్యాయపాలిక గిలిగిసింది. సదరు నిర్దేశాలను ఖచ్చితంగా అమలుపరచకపోయినందునే నేరస్వామ్యం గజ్జెకట్ట ఆడుతోంది. సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి ఏఎస్ ఖరే చేసిన పంచశీల సూత్రాలు మౌళిక సంస్కరణలు అమలైతేనే కదా నేరాలు తగ్గి మహిళల భద్రతకు అసలైన భరోసా కలిగేది.

నేటి స్త్రీ ఆధునిక బానిసా? ప్రపంచ వ్యాప్తంగా రెండుకోట్ల తొంబయి లక్షల మంది మహిళలు, బాలికలు ఆదునిక బానిసత్వంలో మగ్గుతున్నారనీ, వెట్టి కార్మికులుగా, బలవంతపు వివాహాలు,ఎల్లకాలం ఇంటి పనుల్లో మగ్గిపోవడంలాంటి అణిచివేతలకు గురవుతున్నారని, ఒక నూతన అధ్యయనం అంచనా వేసింది. నేడు ప్రతి 130 మంది మహిళలు, బాలికల్లో ఒకరు ఆధునిక బానిసత్వంలో మగ్గుతున్నారని, వాక్, బానిసత్వ వ్యతిరేక సంఘం స్థాపకుల్లో ఒకరైన గ్రేస్ ఫారెస్ట్ తెలిపారు.

మానవజాతి చరిత్రలో ఇంత వరకు ఎప్పుడూ లేనంతమంది మహిళలు బానిసత్వంలో మగ్గిపోతున్నారని ఆమె వెల్లడించారు. వ్యక్తి స్వాతంత్ర్యాన్ని, స్వేచ్ఛను ఒక పద్ధతి ప్రకారం హరించివేయడం, ఆర్థిక లబ్ధికోసం దోపిడీ చేయడం, ఆధునిక బానిసత్వంగా, వాక్ ఫ్రీ సంస్థ నిర్వచించింది.

ఆ సంస్థ అధ్యయనం ప్రకారం బలవంతపు లైంగిక దోపిడీకి గురయ్యే వారిలో 99శాతం , బలవంతపు వివాహాల బాధితుల్లో 84శాతంమంది, బలవంతపు శ్రమ దోపిడీ బాధితుల్లో 58శాతం మంది మహిళలే! ఇప్పటికీ ప్రపంచవ్యాప్తంగా 136 దేశాల్లో బలవంతపు, బాల్య వివాహాలను క్రిమినల్ నేరంగా పరిగణించడంలేదు. కోవిడ్ మహమ్మారి ప్రబలిన ఈకాలంలో సదరు నేరాలన్నీ పెరిగాయే తప్ప తగ్గలేదు. సమరశీల మహిళా ఉద్యమాలను ఐక్యంగా కొనసాగించడమే వాటికి తగిన పరిష్కారం కాగలదు.

---

20. కలిసి జీవించే హక్కు యువతీ, యువకులకు ఉంది

అలహాబాద్ హైకోర్టు తీర్పు

యువతీ-యువకులు తమకు నచ్చిన వారితో కలిసి జీవించవచ్చని అలహాబాద్ హైకోర్టు తేల్చిచెప్పింది. వారి జీవితాల్లో కలుగ చేసుకునే హక్కు ఎవరికి లేదని స్పష్టంచేసింది. ఉభయుల తల్లిదండ్రులకుగానీ, పెద్దలకుగానీ వారిని విడదీసే, నిర్బంధించే హక్కులేదని కరాకండిగా చెప్పింది. నచ్చినవారితో సహజీవనం కొనసాగించే హక్కు యువతకు ఉందని పేర్కొంది. వేర్వేరు మతాలకు చెందిన యువతీ యువకులు పరస్పరం ఇష్టపడి, పెళ్లి చేసుకుంటే ఆ పెళ్లి చట్టబద్ధమే అవుతుందని కానీ చట్టవిరుద్ధం కాదు. సదరు దంపతులను విడదీయడానికి ఉభయులదే పెద్దలు పాల్పడే చర్యలే చట్టవిరుద్ధం కాగలవు. ఉత్తరప్రదేశ్‌లోని

KLVA105M250

షహారాన్ పూర్‌కు చెదిన పూజా అలియాన్ జోయా, షావెజ్ పరస్పరం ప్రేమించుకున్నారు. ఇంటినుంచి పారిపోయి పెళ్లి చేసుకున్నారు. వారి ఆచూకీ కనిపెట్టిన పూజ తల్లిదండ్రులు వారిద్దరిని గృహ నిర్బంధంలో ఉంచారు. తెలిసిన వారి ద్వారా బాధితులు కోర్టులో పిటీషన్ దాఖలు చేశారు. మేజర్లమైన తమకు కలిసి జీవించే అవకాశం ఇవ్వాలని కోర్టును కోరారు. అలహాబాద్ హైకోర్టు న్యాయమూర్తి విచారణ చేపట్టారు. జడ్జీ ఆదేశాల మేరకు పోలీసులు ఆ యువతిని కోర్టులో హాజరు పరిచారు. తన భర్తతోనే తాను కలిసి ఉంటానని ఆమె పేర్కొన్నారు. అందుకు న్యాయమూర్తి ఆమోదిస్తూ తీర్పు వెలువరించారు. ప్రత్యేక వివాహ చట్టం(స్పెషల్ మ్యారేజీ యాక్టు) ప్రకారం భిన్న కులాలకు చెందిన వారు వివాహం చేసుకోవచ్చు.

---

21. బీమా కోరేగావ్ ముద్దాయిలను వెంటనే విడుదల చేయాలి

తెలంగాణ రాష్ట్ర హేతువాద సంఘం రాష్ట్ర అధ్యక్షుడు క్రాంతికార్ డిమాండ్

మహారాష్ట్రలోని బీమా కోరేగావ్‌లో జరిగిన అల్లర్లలో పాల్గొన్న సంఘ్ పరివార్‌కు చెందిన అసలు నేరస్తులను వదిలేసి సదరు ఘటనతో ఏసంబంధం లేని సామ్యవాద, ప్రగతిశీల, విప్లవమేధావులు 16 మందిపై తప్పుడు ఆరోపణలతో తప్పుడు కేసులు పెట్టడం దోపిడీ ప్రభుత్వపాలకవర్గాలు పన్నిన నీచమైన కుట్ర అని తెలంగాణ రాష్ట్ర హేతువాద సంఘం రాష్ట్ర అధ్యక్షులు క్రాంతికార్ ఖండించారు.

సామాజిక , సాంస్కృతిక విప్లవం కోసం నిరంతరం సమరశీల ఉద్యమాలు కొనసాగిస్తున్న సుమారు 16మంది విప్లవ మేధావులపై అక్రమ కేసులు బనాయించడం, వాళ్లను జైలుపాలు చేయడం ప్రజాస్వామిక పౌరహక్కులను కాలరాయడమే! తప్పుడు కేసులుపెట్టి రెండేళ్లు గడిచిపోయినా కనీసం ఎఫ్ఐఆర్ (ప్రాధమిక ఫిర్యాదు పత్రాన్ని) కూడా దాఖలు చేయలేదంటే అదెంత ప్రతిఘాతుక ప్రభుత్వ ఫాశిస్టు కుట్రో వేరే చెప్పాల్సిన పనిలేదు.

తప్పుడు కేసులో విప్లవ రచయితల సంఘం నేత, కరోనా మహమ్మారి బాధితులు, 80 ఏళ్ల వరవరరావును 83 ఏళ్ళ స్టాన్‌స్వామితో పాటు 16మంది ఉద్యమకారులపై తప్పుడు ఆరోపణలతో కేసును బనాయించి జైలుపాలుచేసి రెండేళ్లు గడిచినా బెయిలు ఇవ్వకుండా వేధిస్తున్నారు.

అలాగే 90శాతం అంగవైకల్యం ఉన్న జి.ఎన్.సాయిబాబా నాగ్‌పూర్ జైలులో వర్ణించరాని బాధలతో యమయాతలు పడుతుంటే బెయిలుకానీ, కనీసం పెరోలుకానీ ఇవ్వకుండా వేధిస్తుంటే అదెంత రాజకీయ-మత ఫాసిజమో వేరే చెప్పాల్సిన పనిలేదు. బీమా కోరేగావ్ కేసులో తప్పుడు ఆరోపణలతో, తప్పుడు కేసులు బనాయించి, జైళ్లపాలు చేసిన మేధావులందరిని బేషరతుగా వెంటనే విడుదల చేయాలి.అలాగే అంగవైకల్యంతో కునారిల్లిపోతున్న అనేక సంవత్సరాలుగా జైలులో మగ్గిపోతున్న సాయిబాబాను వెంటనే విడుదల చేయాలి.

క్రాంతికార్ 11-11-2020

మనసు ఫౌండేషన్ పుస్తకాల పరిశీలనాపట్టిక

పుస్తకం సంఖ్య	KLVA105M250
పుస్తకం పేరు	హేతువాదం
తారీఖు	07 February 2025
ముందు అట్ట	NO
వెనుక అట్ట	NO
మొత్తం పేజీలు	41
పెద్ద సైజు పేజీలు	no
ఖాళీ పేజీలు	no
లేని పేజీలు	no
తయారు చేసినది	Sara
పేజీలు విడదీసినది	Sara
స్కాన్ చేసినది	S.Lakshmi
పరీక్ష చేసినది	HEMA
పేజీలు పరిచూసినది	
బైండింగు చేసినది	
ప్యాకింగు చేసినది	
పరిస్థితి	good